

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 15-10-2025 | పేజీలు: 6 | వెల (Price) : Rs. 6.50 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: నవమి ఉ.10:34 తదుపరి దశమి, నక్షత్రం: పుష్యమి మ.12:00 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.1:10-2:49, దుర్ముహూర్తం: ఉ.11:37-12:24, అమృతఘడియలు: శేషం ఉ. 7.10, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:11, సూర్యాస్తమయం: 5:49 | ఒంగోలు సిటీ

Ongole | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Nallagonda | Nizamabad and Bengaluru

డబ్బులు చెల్లించకుండానే
లక్షల్లో పరిహారం

- గ్యాస్ సిలిండర్ ప్రమాదం జరిగితే ఇంట్లో అందరికీ బీమా
- ప్రచారం లేకపోవడంతో నష్టపోతున్న వినియోగదారులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఒక్క పైసా చెల్లించకుండానే అనుకో ని ప్రమాదం జరిగితే గ్యాస్ వినియోగదారులు రూ.30 లక్షల వరకు పరిహారం పొందవచ్చు. జిల్లా పౌరసరఫరాల శాఖ, గ్యాస్ కంపెనీల నిర్వహకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో పరిహారం పొందలేక అనేక మంది బాధితులు నష్టపోతున్నారు. వంట గ్యాస్ ప్రతి ఇంటిలో తప్పనిసరైంది. అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు జరిగిన సమయంలో ఆస్తినష్టంతో పాటు ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుంది. గ్యాస్ సిలిండర్ ప్రమాదాలు జరిగినప్పుడు అయిల్ కంపెనీలు తీసుకునే పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా బాధితులకు పరిహారం అందుతుంది. వినియోగదారులు గ్యాస్‌బుక్ చేసుకున్నప్పుడు పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా ఈ బీమా వర్తిస్తుంది.

గ్యాస్ సిలిండర్ ప్రమాదం చోటుచేసుకున్న వెంటనే సమీప పోలీస్‌స్టేషన్, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్, గ్యాస్ ఏజెన్సీ నిర్వహకులకు సమాచారం ఇవ్వాలి. వారు వచ్చి పరిశీలిస్తారు. సిలిండర్ పేలడంతో ప్రమాదం జరిగినట్లు నిర్ధారిస్తే సంబంధిత డిస్ట్రిబ్యూటర్ అయిల్ కంపెనీ, బీమా సంస్థకు సమాచారాన్ని అందిస్తారు. పరిహారం పొందేందుకు మరణ ధ్రువీకరణ పత్రం, పోస్టుమార్టం నివేదిక, వైద్య బిల్లులు, రశీదులు ఇవ్వాల్సి ఉంటుంది. సిలిండర్ ప్రమాదం జరిగితే ఆస్తి నష్టం వాటిల్లితే రూ.2 లక్షల వరకు బీమా పొందవచ్చు. గాయపడిన ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, తక్షణ సాయం కింద రూ.25వేలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే రూ.6 లక్షలు నష్టపరిహారం వస్తోంది. ఇలా కుటుంబం మొత్తానికి గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు బీమా వర్తిస్తోంది.

రహదారుల నిర్మాణం, పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న రహదారుల నిర్మాణాలు, పునరుద్ధరణ, మరమ్మత్తుల పనులను సత్వరమే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు అదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో రహదారుల వివరాలను ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రవినాయక్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా దెబ్బతిన్న రోడ్లను తక్షణమే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో రహదారులకు సంబంధించిన హామీలపై అధికారులు దృష్టి సారించి సంబంధిత పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అలా వదిలేశారు!

- టంగుటూరు-పొదిలి రోడ్డు మరమ్మతులకు రూ.15లక్షలు మంజూరు
- కొద్దిదూరం గుంతలు పూడ్చి మమ
- మర్రిపూడిలో రెండు కి.మీ అధ్వానంగా రహదారి
- ప్రయాణికుల ఇక్కట్లు


ఎక్స్‌కవేటర్‌తో రహదారికి మరమ్మతులు

మర్రిపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు-పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారి తాత్కాలిక మరమ్మతుల్లో అధికారులు మాయ చేస్తున్నారు. పనుల తీరును పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. కొద్దిదూరం మాత్రమే గుంతలు పూడ్చి వదిలేయడంపై ఆరోపణలు వస్తున్నాయి. గత వైసీపీ పాలనలో ఈ రహదారి గురించి అసలు పట్టించుకోలేదు. దీంతో అది అధ్వానంగా తయారైంది. స్థానిక గీతాంజలి పాఠశాల వద్ద నుంచి రేగలగడ్డ బస్టాండ్ వరకు అడుగడుగునా గుంతలతో నరకప్రాయంగా మారింది. రెండు కిలో మీటర్లు ప్రయాణించేందుకు అర్ధగంట పడుతోంది. ముఖ్యంగా చెరువుకట్ట కింద ప్రాణాలు అరచేత పట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణ పనులు ఊపందుకున్న నేపథ్యంలో భారీ వాహనాల రాకపోకలు పెరిగిపోయి ఆర్‌అండ్‌బీ రహదారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈనేపథ్యంలో ఈ రోడ్డు తాత్కాలిక మరమ్మతులకు ప్రజా ప్రభుత్వం రూ.15క్షలు మంజూరు చేసింది. కొద్దిరోజుల క్రితం పనులు ప్రారంభించిన ఆర్‌అండ్‌బీ అధికారులు కొంతదూరం మాత్రమే గుంతలు పూడ్చారు. ఆతర్వాత ఎలాంటి పనులు చేపట్టలేదు. దీనిపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మసిపూసి మారేడు కాయ చేసి నిధులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో నాలుగు రోజుల క్రితం మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు రహదారి దుస్థితిని వివరించారు. ఆర్‌అండ్‌బీ పనితీరును ఎండగట్టారు. ఈదశలో ఏఈ దీప్తి జోక్యం చేసుకొని ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15లక్షలతో రాకపోకలకు అనువుగా రహదారిని పటిష్ఠపరుస్తామని హామీ ఇచ్చినప్పటికీ సభ్యులు శాంతించలేదు. పూర్తిస్థాయిలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతోపాటు కోనేరుల వద్ద ఇనుప రైలింగ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గూగుల్ డేటా సెంటర్
ఏర్పాటు శుభపరిణామం

- దేశంలోనే అతిపెద్ద డేటా హబ్‌గా మారనున్న విశాఖ
- 1.88 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

టంగుటూరు (కొండపి), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖపట్నంలో ఏర్పాటుకు ఒప్పందం జరగడం శుభపరిణామమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, విశాఖ ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఇది రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయమని అభివర్ణించారు. ప్రపంచపటంలో ఉత్తరాంధ్ర అగ్రస్థానంలో నిలవనుందని అభిప్రాయపడ్డారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. తాజా ఒప్పందంతో డిజిటల్ ఇన్నోవేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో ఇకపై ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పాత్ర పోషించనుందన్నారు. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ హబ్‌గా, ఏ-1 సిటీగా విశాఖ తయారవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.88 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. దార్శనికుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై నమ్మకంతో పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లోని దిగ్గజ కంపెనీలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయని స్వామి పేర్కొన్నారు. పరిశ్రమలు రాష్ట్రానికి తేవడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న మంత్రి నారా లోకేష్‌కు, రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న ప్రధాని మోదీకి విశాఖ ప్రజల తరఫున స్వామి కృతజ్ఞతలు తెలిపారు.


కొళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళ

మర్రిపూడికి నీళ్లొచ్చాయి!

- ఎట్టకేలకు పదిరోజుల తరువాత తాగునీటి సరఫరా

మర్రిపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మర్రిపూడిలో గత పదిరోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తులు తాగునీటి కోసం తహతహలాడిపోయారు. గుక్కెడు నీటికోసం మైళ్లకొద్ది పరుగులుపెట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కుంటిసాకులతో నీటిసరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించారు. ఈ నేపథ్యంలో 'పాచిపట్టి.. శిథిలావస్థకు చేరి' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయపాల్ మర్రిపూడిని సందర్శించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో తాత్కాలికంగా ట్యాంక్ ద్వారా నీటి సరఫరా నిలిపివేసి ప్రత్యామ్నాయంగా బైపాస్ ద్వారా మెయిన్‌లైన్ నుంచి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఎట్టకేలకు తాగునీటి సరఫరా జరగడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. త్వరలో నిచ్చెన ఏర్పాటు చేసి ట్యాంక్ మరమ్మతులు చేసిన తరువాత ట్యాంక్ ద్వారా గ్రామానికి నీటి సరఫరా చేస్తామని చెప్పారు.

భూగర్భజల స్థాయి పెరిగేలా చూడాలి

- కలెక్టర్ రాజాబాబు అదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు భూగర్భజల స్థాయి పెరిగేలా చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతల నిర్మాణాలు, చెరువులు, ఫీడర్ చానల్స్ పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పీ రాజాబాబు అదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో డ్వామా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. ఆయా అంశాలపై కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఉపాధి హామీపథకాన్ని జిల్లాలో పటిష్ఠంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగా వాటర్‌షెడ్స్, క్యాటిల్‌షెడ్స్ నిర్మాణాలను ప్రభుత్వ లక్ష్యం మేరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. నీటి ఎద్దడి జిల్లా కాబట్టి ఈ విషయాన్ని ప్రధానంగా తీసుకొని భూగర్భ జలస్థాయి పెరిగేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.

కె.ఉప్పలపాడు స్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో

కొండపి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ కె.ఉప్పలపాడు జడ్పీ ప్లస్ స్కూల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, స్కూల్‌లో మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై ప్రతి విద్యార్థి చదువు పట్ల శ్రద్ధ పెంచుకునేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.రవీంద్రప్రసాద్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సోమరాజుపల్లి రాఘవేంద్ర శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకరి ప్రాణం తీసిన రాంగ్ రూట్


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఒంగోలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్‌లో మినీ వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన కర్నూలు రోడ్డులో మలాన చికెన్ షాప్ వద్ద మంగళవారం జరిగింది. కరవదికి చెందిన లారీ యజమాని సింగిశెట్టి వెంకటేశ్వర్లు (47) ఒంగోలు నుంచి పేర్నమిట్ట తన లారీ కోసం వెళుతున్నాడు. మార్గమధ్యలో ఒక పాఠశాలకు చెందిన మినీ వ్యాన్ రాంగ్‌రూట్‌లో ఎదురుగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటే శ్వర్లు రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయం అయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఒంగోలు తాలుకా పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీమద్యం తాగించడం వల్లే 11 సీట్లకు పరిమితం

- వైసీపీపై బీజేపీ సీనియర్ నాయకుడు సోము వీర్రాజు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జనంతో కల్తీ మద్యం తాగించడం వల్లే వైసీపీ గత ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితమైందని, రాష్ట్రంలో ఐదేళ్ల పాలనలో లిక్కర్ అవినీతికి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కూటమి ప్రభుత్వం పాలనపై మాట్లాడే అర్హతలేదని శాసనసమండలి సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని కళాశాల సమావేశపు హాలులో మంగళవారం జరిగిన ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నకిలీ మద్యం అమ్మకాల ద్వారా రూ.45వేల కోట్ల అక్రమంగా సంపాదించారని వైసీపీ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

చేతుల శుభ్రత

- పాఠశాలల్లో కనిపించని 'హ్యాండ్ వాష్'
- అవగాహన కల్పించకపోవడంతో అనారోగ్యమే!

ప్రకటనలకే పరిమితమా?

ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచేందుకు ప్రకటించిన పాఠశాలల్లో హ్యాండ్ వాష్ ప్రకటనలకే పరిమితమైంది. నగరంలోని కార్పొరేషన్ పాఠశాలల్లో నీటి కొరత ఏర్పడటంతో చేతులు శుభ్రం చేసుకునే అంశం కార్యరూపం దాల్చడం లేదు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు అవగాహన కల్పిస్తున్నామని చెబుతున్నప్పటికీ అందుబాటులో సరిపడా నీరు లేకపోవడంతో మురికి చేతులతోనే ముద్ద తినాల్సిన దుస్థితి కనిపిస్తోంది. దీంతో ఏడాదికి ఒకసారి మాత్రమే మొక్కుబడిగా హ్యాండ్ వాష్‌పై బక్కెట్ నీటితో అవగాహన కల్పించి ముగించేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు వరల్డ్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం..

నేడు హ్యాండ్ వాష్‌డే


చేతులను సబ్బుతో కడుకొన్న

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత తెలుగుదేశం పాలనలో పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు, అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రతి ఏడాదీ ఎస్ఎస్ఏ గ్రాంట్ కింద రూ.5వేలు నుంచి రూ.7వేల వరకు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో సబ్బులు, టవల్స్, అవసరమైన సామగ్రి కొనుగోలు చేయాలి. విద్యార్థులకు అందుబాటులో ఉంచడంతోపాటు, భోజనం చేసే ముందు విద్యార్థులు చేతులు కడుక్కుంటున్నారా? లేదా? అని పర్యవేక్షించాలి. కానీ ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే మరిచింది. కనీసం నిధులు కేటాయించకపోగా, ప్రచారం తప్ప పరిశుభ్రతను పట్టించుకున్న వారు లేరు. దీంతో విద్యార్థులు ఉదయం నుంచి పుస్తకాల చేతపట్టి, నోట్సులు రాసి, ఇంకులయిన చేతులతో, డ్రిల్ క్లాసులో చేతికంటిన మంటితోనే అలాగే భోజనానికి కూర్చోవడం కనిపిస్తోంది.

టవల్స్, సబ్బులు లేవు

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల పరిశుభ్రతకు ప్రత్యేక నిధులు కేటాయించారు. తప్పనిసరిగా టవల్స్ సబ్బులు అందుబాటులో ఉంచాలి. మధ్యాహ్నం భోజన సమయంలో తప్పనిసరిగా తర్వాతే భోజనం చేయాలి. అందుకు ఆ పాఠశాలల ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలి. కానీ అలాంటివీ ప్రభుత్వ పాఠశాలల్లో కనిచూపుమేరలో కూడా కనిపించడం లేదు. కేవలం తాగేందుకు మాత్రమే అరకొర నీటిని బబుల్స్ ద్వారా తెప్పిస్తుండగా, కొన్ని పాఠశాలల్లో అసలు తాగునీరు లేక విద్యార్థులు దాహంతో అల్లాడిపోతున్నారు. ఫలితంగా విద్యార్థులకు శ్వాసకోస, టైఫాయిడ్, కలరా, జ్వరం, కామెర్లు, విరేచనాలు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు వెల్లడిస్తున్నారు.

చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలంటే..

ముందుగా అరచేతిని సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తరువాత చేతుల వెనుక భాగం శుభ్రం చేయాలి. అనంతరం వేళ్ల వెనుక మణికట్టు భాగంలో కడగాలి. తర్వాత దశలో చేతి వేళ్ల మధ్య కడగాలి. చివరిగా చేతి వేళ్ల గోళ్లను శుభ్రం చేసుకున్న తర్వాతనే భోజనం చేయాలి. భోజనం చేసే ముందు, మల విసర్జనకు వెళ్లివచ్చిన తర్వాత, ఆటలు ఆడిన తర్వాత, దగ్గినపుడు, తుమ్మినపుడు చేతులు అడ్డుపెట్టుకోవడం ద్వారా క్రిములు చేతికి అంటుకునే ప్రమాదం ఉంది. అందువల్ల శుభ్రత చాలా ముఖ్యం.

గ్రామాల అభివృద్ధి బాధ్యత కార్యదర్శులదే

- ప్రజారోగ్యం, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి
- కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమగ్రాభివృద్ధి, సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని కలెక్టర్ రాజాబాబు అన్నారు. ఈ విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం ఒంగోలు డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించడంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. పంచాయతీకి సంరక్షణ అధికారిగా (కస్టోడియన్) కార్యదర్శులపై తమ పరిధిలోని ప్రభుత్వ భూములు అక్రమణలకు గురికాకుండా కాపాడాలన్నారు. రెవెన్యూకు సంబంధించిన అంశమని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగునీటి సమస్య కేవలం ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి మాత్రమే చెందినదిగా అనుకోవద్దని, స్థానిక పరిస్థితులపై పంచాయతీ కార్యదర్శుల సమగ్ర పరిశీలన అవసరమని అన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

- 16న పీఎం శ్రీశైలం రూట్లు మార్పు
- దోర్నాల - శ్రీశైలం, గుంటూరు - కర్నూలు వెళ్లే వాహనాల మళ్లింపు
- మార్కాపురం డీఎస్పీ నాగరాజు

పెద్ద దోర్నాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం పుణ్యక్షేత్ర సందర్శనకు ఈనెల 16వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వస్తుండటంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ ప్రధాని పర్యటన నేపథ్యంలో 16వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే వాహనాలను దోర్నాల వద్దే నిలిపివేయనున్నామని, ఈ విషయాన్ని యాత్రికులు గమనించాలని ఆయన కోరారు. గుంటూరువైపు నుంచి కర్నూలు వెళ్లే వాహనాలను పెద్దారవీడు కుంట జంక్షన్ వద్ద దారి మళ్లించి గిద్దలూరు, నంద్యాల మీదుగా వెళ్లేలా రూట్ మార్చినట్లు చెప్పారు. కర్నూలు వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే యాత్రికులు కూడా వీలైనంత వరకు ఆరోజు ప్రయాణం వాయిదా వేసుకోవడం ఉత్తమమన్నారు. అప్పటికే ప్రయాణం చేసి దోర్నాల వచ్చిన వారు మాత్రం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి ఉండాల్సిందేనని, ఇందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ రావు, ఎస్సై మహేశ్ పాల్గొన్నారు.

మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి
రైతు ఆత్మహత్య

ముండ్లమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూజెండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు వెంగళశెట్టి వెంకటేశ్వర్లు (50) మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. వెంకటేశ్వర్లుకు రెండెకరాలు పొలముంది. సేద్యంలో నష్టాలు రావడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఏ పనిచేసినా కలిసి రావడం లేదనే ఆత్మన్యూనతతో దిగులు పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈనెల 8వ తేదీ మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00


దోర్నాల జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల


పొణ్యం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

కర్నూలులో కీలకంగా..

కర్నూలులో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయడంలో ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ నేతలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరు అక్కడి ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కీలక నేతలతో కలిసి సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు సమీప నియోజకవర్గాల నుంచి జన సమీకరణ ఏర్పాట్లలో నిమగ్నమై పనిచేస్తున్నారు. అలాగే కర్నూలు సభ కోసం జిల్లా నుంచి 160 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. అదేవిధంగా శ్రీశైలం మల్లన్న దర్శనానికి మోదీ వస్తున్న నేపథ్యంలో పెద్దదోర్నాల నుంచి ఘాట్ రోడ్డులో పోలీసు ఆంక్షలు కొనసాగుతున్నాయి.

- ప్రధాని పర్యటన బాధ్యతల్లో ఉమ్మడి జిల్లా నేతలు
- భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు
- రేపు నరేంద్ర మోదీ జీఎస్టీ సభ
- ఆరోజు దోర్నాల వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

ఒంగోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ కర్నూలు జిల్లా పర్యటన ఏర్పాట్లలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. జీఎస్టీలో సంస్కరణలు తెచ్చి అనేక రకాల వస్తువులపై పన్నులు తగ్గించిన అనంతరం దేశవ్యాప్తంగా సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో పెద్దఎత్తున సభలు నిర్వహించి ప్రజలకు సంస్కరణల ఫలితాలు వివరించాలని కేంద్రం నిర్ణయించిన విషయం విదితమే. ఆ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇక్కడి ప్రభుత్వం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. అదే సమయంలో దేశంలో ఈ అంశంపై ప్రధాని మోదీ పాల్గొనే తొలిసభను రాష్ట్రంలో ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సంకల్పించారు. అందుకు వేదికగా కర్నూలును ఎంపిక చేశారు. ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం కర్నూలు నగర సమీపంలో ఈ సభ జరగనుంది. లక్షలాది మంది ప్రజలు హాజరయ్యేలా చూడటంతో పాటు సభా ప్రాంగణంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు సంబంధించి ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలకు అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. దీంతో రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ తదితరులు అక్కడే మకాం వేసి పనిచేస్తున్నారు.

నియోజకవర్గాల్లో పర్యటనలు

తొలి రోజున సభాప్రాంగణంలో ఏర్పాట్లు, ముఖ్యనేతలు, అధికారులతో జరిగిన సమీక్షల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన నేతలు మంగళవారం జనసమీకరణ చర్యలలో భాగంగా పలు నియోజకవర్గాల్లో పర్యటించారు. పాణ్యం నియోజకవర్గంలో అక్కడి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. డోన్ నియోజకవర్గంలో అక్కడి ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పరిశీలకుడిగా పాల్గొన్నారు. కోడుమూరు నియోజకవర్గ టీడీపీ సమావేశంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొని ప్రధాని సభకు జనసమీకరణపై అక్కడి పార్టీశ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా స్థానికంగా ప్రజలను కదిలించే అంశంపై అక్కడి నాయకులతో చర్చించారు. పలువురు రాష్ట్ర మంత్రులు, కీలక నేతలతో కలిసి ప్రధాని సభ జరిగే ప్రాంగణంలో ఏర్పాట్ల పర్యవేక్షణలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు.

అప్రమత్తమైన పోలీసులు

ప్రధాని నరేంద్రమోదీ గురువారం శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానాన్ని సందర్శించనున్నారు. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. శ్రీశైలం బందోబస్తుకు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో పోలీసులు వెళ్తున్నారు. మరోవైపు శ్రీశైలం వెళ్లే మార్గంలో దోర్నాల కీలక ప్రాంతం కాగా అక్కడ కూడా పోలీసులు మకాం వేస్తున్నారు. దోర్నాల వద్ద ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు. కర్నూలు జిల్లా నుంచి ఇటు పల్నాడు ప్రాంతం, మార్కాపురం వైపు నుంచి శ్రీశైలం నుంచి వచ్చే వాహనాలన్నింటినీ 16వతేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దోర్నాల వద్దనే నిలిపివేసేలా జిల్లా పోలీసులు చర్యలు చేపట్టారు. పల్నాడు ప్రాంతం నుంచి కర్నూలు వైపు వెళ్లే వాహనాలను పెద్దారవీడు మండలం కుంట నుంచి గిద్దలూరు, నంద్యాల వైపు మళ్లిస్తున్నారు. అలాగే నల్లమల అటవీ ప్రాంతంలోనూ ముమ్మరంగా తనిఖీలు కొనసాగిస్తున్నారు.



ప్రధాని పర్యటనకు 160 ప్రత్యేక బస్సులు

- రీజియన్ నుంచి సిద్ధం చేసిన ఆర్టీసీ అధికారులు
- రెండు రోజులపాటు పలు సర్వీసులు నిలుపుదల
- ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో ప్రధాని మోదీ పాల్గొంటున్న సభకు ఆర్టీసీ ప్రకాశం రీజియన్ నుంచి 160 బస్సులను కేటాయించింది. ప్రజలతోపాటు అధికారులు, పోలీసులను సభకు తరలించేందుకు వీటిని ఏర్పాటు చేసింది. ఈ బస్సులు ఈనెల 15, 16 తేదీలలో కర్నూలు జిల్లాకే పరిమితమవుతాయి. ఈనేపథ్యంలో ఆర్ఎం సత్యనారాయణ నేతృత్వంలో జిల్లాలోని ఐదు డిపోల మేనేజర్లు సమావేశమై ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి రెండు రోజులపాటు సహకరించాలని కోరారు.


నాగులవరం రోడ్డులో కంప తొలగించి అమ్మకాలకు సిద్ధం చేస్తున్న వెంచర్

ఆశలకు రెక్కలు

మార్కాపురం జిల్లా, వెలిగొండ, మెడికల్ కాలేజీలపై ప్రభుత్వం స్పష్టత

- చకచకా సాగుతున్న పనులు
- ఊపందుకుంటున్న రియల్ వ్యాపారం
- పట్టణం చుట్టూ వెంచర్లు

మార్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. మార్కాపురం జిల్లా ఏర్పాటుపై స్పష్టత ఇచ్చింది. వెలిగొండ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మెడికల్ కాలేజీకి టెండర్లు పిలిచారు. రిలయన్స్ సీబీజీ ప్లాంట్లకు భూసేకరణ పూర్తయ్యింది. ఇన్ని అనుకూల పరిస్థితుల నేపథ్యంలో మార్కాపురంలో రియల్ వ్యాపారానికి జవసత్వాలు వచ్చాయి. ప్రస్తుతం పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా స్థలాల కొనుగోలు, అమ్మకాలు ఊపందుకున్నాయి. నూతన వెంచర్లతోపాటు గతంలో వేసిన వాటిని కూడా మళ్లీ శుభ్రం చేయించి విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నారు.

రెండేళ్ల తర్వాత మళ్లీ ఊపు

మార్కాపురంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గత రెండేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా మందగించింది. క్రయ విక్రయాలు అంతంత మాత్రంగానే సాగాయి. ఈక్రమంలో ప్రస్తుతం మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యమని ప్రభుత్వం, పాలక పెద్దలు స్పష్టం చేస్తున్నారు. ఈ సంవత్సరం చివరికి లేదా 2026 ఆరంభానికల్లా జిల్లా ఏర్పాటు ఖాయమని ఉన్నత స్థాయి వర్గాలు చెబుతున్నాయి. అలాగే పశ్చిమ ప్రకాశానికి అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టుకు ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించింది. ఫీడర్ కెనాల్‌లో లైనింగ్ పనులు చేసేందుకు రూ.456కోట్లు మంజూరు చేసింది. వైసీపీ హయాంలో ప్రారంభించి మధ్యలోనే నిలిచిపోయిన మెడికల్ కాలేజీని పీపీపీ పద్ధతిలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. తాజాగా కేంద్ర రక్షణ శాఖ మార్కాపురానికి సమీపంలోని దొనకొండలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇవేకాక రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో సీబీజీ ప్లాంట్లు కూడా మార్కాపురం నియోజకవర్గంలో ఏర్పాటుకు భూసేకరణ జరిగింది. ఈ విధంగా మార్కాపురం అభివృద్ధివైపు అడుగులు వేసేందుకు అన్నివైపుల నుంచి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంటోంది.

నూతన వెంచర్లతో రియల్ వ్యాపారం కళకళ

కొత్త జిల్లా ప్రకటనలతో మార్కాపురం పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రస్తుతం నూతన వెంచర్లు వెలుస్తున్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారిని ఆనుకుని, రైల్వే స్టేషన్ రోడ్డు, తర్లుపాడు రోడ్డు, కంభం రోడ్డు, రాయవరం, వేములకోట, దరిమడుగు గ్రామాల చుట్టూ వెంచర్లు వేస్తున్నారు. రెండు నెలల వ్యవధిలోనే సుమారు 500 ఎకరాల్లో వెంచర్లు వేసినట్లు సమాచారం. నూతన వెంచర్లతోపాటు గతంలో వేసి మధ్యలో నిలిచిపోయిన వాటిపై కూడా వ్యాపారులు దృష్టి సారించారు. వాటిలో మొలిచిన పిచ్చిచెట్లను తొలగించే పనులు చురుగ్గా చేపట్టారు. పట్టణంలోని కొన్నిచోట్ల అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు కూడా జోరందుకున్నాయి. ఈ పరిణామాలు స్థిరాస్తి వ్యాపారుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.



గ్రామాల అభివృద్ధి బాధ్యత కార్యదర్శులదే

- ప్రజారోగ్యం, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి
- అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి
- భూములను కాపాడాలి
- నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు
- శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు

2



చేతుల శుభ్రత ప్రకటనలకే పరిమితమా?

- స్కూళ్లలో కనిపించని 'హ్యాండ్ వాష్'
- టవల్స్, సబ్బులు లేవు
- అవగాహన లేక విద్యార్థులు అనారోగ్యం పాలు
- నేడు హ్యాండ్ వాష్ దినోత్సవం

2



రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చింతచెట్టు

● కర్నూలు రోడ్డులో గంటపాటు స్తంభించిన ట్రాఫిక్

ఒంగోలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని కర్నూల్ రోడ్డులో చింతచెట్టు విరిగి రోడ్డుకు అడ్డుగా పడటంతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ సంఘటన స్థానిక నవభారత్ బిల్డింగ్స్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. నగరంలో అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా వాటర్ పైప్‌లైన్ నిర్మాణం కోసం రోడ్డుపక్కన కార్పొరేషన్ సిబ్బంది గాడి తవ్వారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ గాడిలోకి నీరు చేరి చింతచెట్టు పెద్ద శబ్దం చేస్తూ విరిగి రోడ్డుపై పడింది. గంటన్నర పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చెట్టు పడగా 2.30 గంటల వరకు చెట్టు తొలగించే పనిలో కార్పొరేషన్ సిబ్బంది, పోలీసులు శ్రమించారు.







వ్యవసాయ, ఉద్యానవన అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి స్వామి

సకాలంలో విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి

● మంత్రి స్వామి ● వ్యవసాయ, ఉద్యానవన అధికారులతో సమీక్ష

టంగుటూరు (కొండపి), అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి మంత్రి జిల్లా ఉద్యానవన, వ్యవసాయ అధికారులతో తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ రైతులకు సరిపడా శనగలు, మినుములతోపాటు అవసరమైన ఇతర పొగాకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను కొరత లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు. సకాలంలో సబ్సిడీపై యంత్రాలు, యంత్ర పరికరాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా నిరంతరం అధికారులు ఆయా స్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షించాలని మంత్రి స్వామి సూచించారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో అర్హులకు సంక్షేమ ఫలాలు

● సొసైటీ చైర్మన్ విజయమ్మ



రుద్రవరంలో రేషన్‌కార్డులను అందజేస్తున్న విజయమ్మ

సంతనూతలపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమఫలాలు అందుతున్నాయని సిండికేట్ రైతు సొసైటీ చైర్మన్ కూకట్ల విజయమ్మ పేర్కొన్నారు. మంగళవారం రుద్రవరంలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ ‌రైస్‌రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూకట్ల శరత్, వీఆర్వో శ్రీనివాసరావు, నాయకులు హరినాథ్, సుబ్బారావు, సుబ్బారావు, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

● సంతనూతలపాడు సచివాలయంలోను మంగళవారం స్మార్ట్ రైస్‌రేషన్ కార్డులను టీడీపీ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.శ్రీనివాసరావు, బి.శంకర్, పీఎస్.స్వామిచౌదరి, ఎం.పోలిశెట్టి, సుబ్బారావు, శ్రీలత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు మండలంలో..

ఒంగోల(రూరల్): మండలంలోని దశరాజుపల్లి, ఉలిచి, యరజర్ల, వలేటివారిపాలెం తదితర స్మార్ట్ రేషన్‌కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ జి.శ్రీనివాసరావు, కంకణాల శ్రీను, మాజీ సర్పంచ్‌లు యానాదినాయుడు, వై.నరసింహారావు, చుంచు శింగయ్య, చుంచు రామాంజనేయులు, వలేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులో వీఆర్వో సుబ్బయ్య, టీడీపీ నాయకులతో కలిసి స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కనగాల శ్రీనివాసరావు, పెంట్యాల కోటేశ్వరరరావు, తిరుమలశెట్టి శ్రీను, పెంట్యాల శ్రీనివాసరావు, కుంచాల నాగరాజు, మసిముక్కు భాస్కర్, తెలగతోటి జాన్సన్, కొండా శ్రీనివాసరావు, కోండ్రు ఆశీర్వాదం, పిన్నక శ్రీకాంత్, బి.సెల్వం, జాలాది సురేంద్ర పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జేఏసీ మహిళా విభాగం



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న మహిళా ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ రాజాబాబును మంగళవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో ఏపీ జేఏసీ అమరావతి జిల్లామహిళా విభాగం(ఉమెన్‌వింగ్)ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమెన్‌వింగ్ చైర్‌పర్సన్ నర్రా విజయలక్ష్మి, జనరల్ సెక్రటరి సీహెచ్.శ్రీదేవి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. సమస్యలపై ఎప్పుడైనా తన దృష్టికి తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు సుమలత, ఎ.తిరుపతమ్మ, అనంతలక్ష్మి, షేక్ హసీనా, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణదారులు జాగ్రత్తలు తీసుకోవాలి



టపాసుల దుకాణాల ఏర్పాటు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, అధికారులు

కొండపి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాణ సంచా విక్రయించే దుకాణదారులు ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం షాపులు ఏర్పాటు చేసే కొండపి ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం తన కార్యాలయంలో దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. దుకాణాలు దూరదూరంగా ఏర్పాటు చేసుకోవాలని, అగ్నిమాపక వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

‘దొనకొండ’కు 14,102 స్మార్ట్ రేషన్ కార్డులు



స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాత రేషన్‌కార్డుల స్థానంలో ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్‌కార్డులు మండలంలోని 28 రేషన్‌షాపుల పరిధిలో 14,102 కార్డులు తహసీల్దార్ కార్యాలయానికి చేరాయి. వాటిని తహసీల్దార్ రమాదేవి రేషన్ డీలర్ల ద్వారా లబ్ధిదారులకు అందించే కార్యక్రమం ముమ్మరంగా చేపడుతున్నారు. డీలర్లు స్మార్ట్ కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఈపోస్ మిషన్‌లో అప్‌డేట్ చేసుకొని లబ్ధిదారుల ఫింగర్ బయోమెట్రిక్ వేయించుకొని స్మార్ట్ కార్డు అందజేస్తున్నారు. సచివాలయ ఉద్యోగి.. లబ్ధిదారుడి ఫేస్ లేదా ఆధార్ ఓటీపీ ద్వారా కార్డు పొందినట్లు యాప్‌లో సబ్మిట్ చేసి కార్డు డెలివరీ చేసేలా అధికారులు నిర్దేశించినట్లు సమాచారం. కానీ మండలంలోని పలు రేషన్ షాపుల పరిధిలో సచివాలయాల ఉద్యోగులు ఈ కార్యక్రమానికి సహకరించటం లేదనే ఆరోపణలున్నాయి. సచివాలయ సిబ్బంది ఎప్పుడు ఆథరైజేషన్ చేస్తారో రేషన్‌కార్డు ఎప్పుడు యాక్టివ్‌లోకి వస్తుందో అని పలువురు చర్చించుకుంటున్నారు.

పేద, మధ్య తరగతి వర్గాలకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనకరం



మాట్లాడుతున్న ఎంపీడీవో అజిత

తాళ్లూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి జీఎస్టీ తగ్గింపు ప్రయోజనకరంగా ఉంటుందని ఎంపీడీవో పి.అజిత, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీకమిషనర్ సుధాకర్ చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు మెరుగైన సేవింగ్స్ జరుగుతాయన్నారు. ప్రతిగృహానికి తక్కువ ధరలో ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎంఎ్‌సఎంఈల వస్తువులు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడు గొంది రమణారెడ్డి, సర్పంచ్ కాలేషావలి, రామయ్య, రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ ద్వారా విద్యుత్ బకాయిలపై దృష్టి సారించాలి

ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులు



రికార్డులు పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులు

ముండ్లమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బకాయిలు వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పాలగిరి శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం ఆయన స్థానిక సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బకాయిల జాబితాను పరిశీలించారు. దాదాపు రెండు కోట్ల మేర విద్యుత్ బకాయిలు పేరుకు పోయాయన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఈ నెలాఖరు కల్లా 50 శాతం మేర వసూలు చేయాలని చెప్పారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ చినఅంకబాబు, లైన్ ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్‌లు పీ ఆంజనేయులు, సోమ్లా నాయక్ ఉన్నారు.

సీఎస్‌పురంలో యూటీఎఫ్ సభ్యత్వ కార్యక్రమం



సభ్యత్వం ఇస్తున్న యూటీఎఫ్ నేతలు

సీఎస్‌పురం(పామూరు) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ హైస్కూళ్లలో విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులను యూటీఎఫ్ యునియన్ నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ వెంకటరామయ్య, షేక్ పాదుషాలు కలిసి వారిని యూటీఎఫ్‌లో సభ్యులుగా చేర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వేమా నారాయణ, జె. వెంకటరావు, కె. నాగరాజు, బి.వి.ఎస్ రమేష్ పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య అంగన్వాడీ కేంద్రంలోనే..

కనిగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :పూర్వ ప్రాథమిక విద్య అంగన్వాడీ కేంద్రంలోనే లభ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతమ్మ చెప్పారు. మండలంలోని అలవలపాడులో మంగళవారం పోషక మాసం కార్యక్రమంలో పోషకాహార లోగోను ప్రదర్శించారు.

ఉరేసుకుని నవవధువు ఆత్మహత్య

వెలిగండ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం గండ్లోపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణపావని వివరాల మేరకు... గండ్లోపల్లికి చెందిన కౌసల్య(19) అదే గ్రామానికి చెందిన తోకల రామాంజితో 20 రోజుల క్రితం వివాహమైంది. వారి మధ్య కొద్దిరోజుల్లోనే కుటుంబ కలహాలు తలెత్తడంతో కౌసల్య మనస్తాపం చెందింది. మంగళవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు పొలానికి వెళ్లగా తలుపులు బిగించుకొని చీరతో ఫ్యాన్‌కి ఉరేసుకుని మృతి చెందింది. పొలం నుంచి వచ్చిన తల్లిందండ్రులు తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లే సరికి ఫ్యాన్‌కి వేలాడుతూ కనిపించింది. సమాచారం అందిచడంతో ఘటన స్థలానికి చేరుకోని మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రానైట్ ఫ్యాక్టరీల సమ్మె విరమణ

● సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేలు బీఎన్, నారాయణరెడ్డిల హామీ

● విధిలేని పరిస్థితుల్లో సమ్మె విరమణకు ఫ్యాక్టరీ అసోసియేషన్ అంగీకారం

● నిర్ణయం వెలువడగానే పరిశ్రమల్లో మొదలైన పనులు



ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, కందుల నారాయణరెడ్డిలతో అసోసియేషన్ ప్రతినిధులు

చీమకుర్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : "ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దాదాపు 2,500 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉంటే కేవలం ఈ ప్రాంతానికి చెందిన 800 ఫ్యాక్టరీలు మాత్రమే మూసివేసి సమ్మె చేస్తే ప్రయోజనం ఏమిటి. సమస్య అందరిదీ. అందరికీ మేలు కలిగేలా నిర్ణయం తీసుకోవాలి. మీరు సమ్మె విరమించి ఫ్యాక్టరీలను రన్ చేయండి. మీ సమస్యల పరిష్కారానికి మాది హామీ. ఇప్పటికే మంత్రులు మీకు హామీ ఇచ్చారు." అని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. వారి విస్పష్టమైన హామీ ఇచ్చిన మేరకు గత 14 రోజులుగా గెలాక్సీ గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు నిర్వహిస్తున్న సమ్మెను ఎట్టకేలకు విరమించారు. చీమకుర్తి పట్టణంలో ఓ గెస్ట్‌హౌస్‌లో ఇరువురు ఎమ్మెల్యేలు, ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు మంగళవారం సమావేశం అయ్యారు. సమ్మె చేయటానికి గల కారణాలు, గత పద్నాలుగు రోజులుగా సమ్మె జరిగిన సమయంలో జరిగిన పరిణామాలను కూలంకుషంగా చర్చించారు. సీనరేజీ వసూలు హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థ తీరు.., దీనివల్ల గ్రానైట్ ఫ్యాక్టరీలకు జరిగే విపరీతమైన కష్టనష్టాలు గురించి ఎమ్మెల్యేల ముందు ఓనర్ల అసోసియేషన్ నాయకులు ఏకరవు పెట్టారు. ఇవన్నీ సావధానంగా విన్న ఎమ్మెల్యేలు "మీ సమస్యల పరిష్కారానికి మాదీ హామీ" అని తెలుపటంతో వారి కోరిన మేరకు సమ్మెను విరమించటానికి అసోసియేషన్ నాయకులు అంగీకరించారు. ప్రభుత్వంతో కాంట్రాక్ట్ కుదుర్చుకున్న తర్వాత ఏఎంఆర్ సంస్థ తీరులో మార్పు రాకుండా ఫ్యాక్టరీలకు నష్టం కలిగించేలా అదనపు వసూళ్లకు పాల్పడితే తిరిగి మెరుపు సమ్మెను ఈసారి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తామని అసోసియేషన్ నాయకులు తెలిపారు.

కాగా సమ్మె విరమణ నిర్ణయం బహిర్గతం కాగానే బూదవాడ, మర్రిచెట్లపాలెం ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీలను వెంటనే తెరచి ఉత్పత్తిని ప్రారంభించటం విశేషం. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు కాట్రగడ్డ రమణయ్య, యర్రగుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, కోడూరి వెంకట్రావు, చలపతిరావు, రాధాకృష్ణమూర్తి, మలినేని వెంకటేశ్వర్లు, రాము తదితరులు పాల్గొన్నారు.



నేడు మహాకుంభాభిషేకానికి ముస్తాబైన శివాలయం

నాభిశిల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

ముండ్లమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లు గ్రామంలో శ్రీ అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామి కుంభాభిషేకంతో పాటు నాభిశిల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం జరగనుంది. ఈనెల 11వ తేదీ నుంచి గణపతి పూజా కార్యక్రమం నుంచి నాలుగు రోజుల పాటు వివిధ పూజలు నిర్వహించారు. పసుపుగల్లు గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎస్‌ఐ కే కమలాకర్ మూడు రోజుల నుంచి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

రైతన్నలకు అండగా ప్రజాప్రభుత్వం

అవీఇవీ



రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్న శ్రీనివాసులు

పామూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతల శ్రేయస్సు కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు చెప్పారు. మండలంలోని నుచ్చుపొద గ్రామ సచివాలయంలో సబ్సిడీపై నుచ్చుపొద, తిరగళదిన్నె గ్రామాలకు చెందిన పలువురు రైతులకు యూరియాను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కామేపల్లి సూర్యప్రకాష్‌రావు, ఇర్రి కోటిరెడ్డి, మండ్ల మల్లికార్జున, ఇర్రి శ్రీనివాసులు, వంకదారి వెంకటేశ్వర్లు, వీఏఏ నూరి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏపీవో మాల్యాద్రి

పామూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాది హామీ పథకంలో జాబు కార్డులు కలిగి ఉన్న కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో మాల్యాద్రి చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు మందిరంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ కూలీలు ఈకేవైసీ చేయించుకోవడం వలన దొంగ మస్టర్లు నివారించవచ్చునని చెప్పారు. పనులు జరుగుతున్నప్పుడు ఉదయం ఒక ఫొటో నాలుగు గంటల తరువాత మరో ఫొటో తీయాలన్నారు. సమావేశంలో టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.



రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

రేషన్ పంపిణీలో అక్రమాలకు చెక్

పామూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్‌కార్డుతో రేషన్ అక్రమాలకు చెక్ పడుతుందని ఏఎంసీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలోని తూర్పు కట్టకిందపల్లిలో క్యూఆర్‌కోడ్‌తో తయారు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం రేషన్ కార్డుదారులకు అంద చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీనేతలు పెద్దిశెట్టి శ్రీనివాసులు, నీరుకట్టు శ్రీనివాసులు, వీఆర్వో సరస్వతి పాల్గొన్నారు. కాగ మండలంలోని రేగిచెట్లపల్లి గ్రామంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బత్తుల మస్తాన్‌రావు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అమ్మాలూరి సుధాకర్‌రావు, బూత్ కన్వీనర్ పెనుబాకుల వెంకట్రావు, ప్రసాద్‌రెడ్డి, రేషన్ డీలర్ ఇల్లూరి శ్రీనివాసరెడ్డి, గవిరెడ్డి కొండారెడ్డి, గాజులపల్లి జనార్దన్,తదితరులు పాల్గొన్నారు.

కొప్పోలు రోడ్డులో డ్రైనేజీ పరిశీలన

ఒంగోలు(రూరల్), అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులోని డ్రైనేజీ వ్యవస్థలను కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత మంగళవారం పరిశీలించారు. అలాగే ఎన్టీఆర్‌కాలనీ వద్ద పూడ్చివేసిన పాత కల్వర్టును, బృందావనగార్డెన్స్‌కు మంచినీరు వెళ్లే పైపులైన్‌ను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. కొప్పోలు రోడ్డుకు అనుసంధానంగా ఉన్న పొలాలు, కాలనీల నుంచి వచ్చే వర్షపునీరు పూర్వం నుంచి ఎన్టీఆర్ కాలనీ దగ్గర గల కల్వర్టు నుంచి పోతురాజు కాలువకు చేరేవని, అయితే కొందరు అక్కడి కల్వర్టును ఉత్తరం వైపు పూడ్చివేయటంతో కొప్పోలురోడ్డు నీరు నిలిచిపోతోందని స్థానికులు తెలిపారు. దీనివల్ల తారురోడ్డులో రోజుల తరబడి నీరు నిలిచిపోవటంతో గుంతలు పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. ఎన్టీఆర్‌కాలనీ వద్ద గల కల్వర్టు పూడ్చివేతను తొలిగిస్తే సమస్య పరిష్కారం అవుతుందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం బృందావన్‌గార్డెన్స్‌కాలనీ మంచినీటి పైపులోకి మురుగునీరు చేరడంపై కమిషనర్ స్పందించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈ ఐసయ్య, ఏఈ అంజరెడ్డి, స్థానికులు పోస్టల్ మోహన్‌రావు, దివి బ్రహ్మానందం, రాజు తదితరులు పాల్గొన్నారు

మహిళల పట్ల వైసీపీ నేతల అవమానకర వ్యాఖ్యలు దారుణం

దర్శి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : మహిళల పట్ల వైసీపీ నాయకులు అవమానకర వ్యాఖ్యలు చేయటం దారుణమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి డీఎన్‌ఏలోనే నైతిక విలువలు లేవని విమర్శించారు. వినుకొండ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలకు సమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీ నాయకులు మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళల ఆగ్రహాన్ని చవిచూస్తారని హెచ్చరించారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు శుభపరిణామం

రాష్ట్రంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం పలకటం శుభపరిణామని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. విశాఖలో రూ.87 వేల కోట్లతో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థ నిర్ణయించటంతో రాష్ట్ర ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. యువతకు పుష్కలంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం

ముండ్లమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పులిపాడు, బంగారమ్మగుట్ట, రెడ్డినగర్, బసవాపురం, నందమూరి నగర్, శ్రీనివాస నగర్, జగన్‌నగర్ గ్రామాల్లో భారీ వర్షం పడింది. ముండ్లమూరు, వేంపాడు, పసుపుగల్లు గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది.

నకిలీ మద్యం బాటిళ్లను గుర్తించేందుకు 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్ !

● ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ

ఒంగోలు క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం బాటిళ్లను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను తయారు చేసిందని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్.ఆయేషాబేగం మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మద్యం సీసాలపై ఉన్న లేబుళ్లపై ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేస్తే వెంటనే బాటిల్ తయారీ, కంపెనీ పేరు, ఎమ్మార్పీ ధర వెంటనే తెలిసి పోతుందన్నారు. అదేవిధంగా ఇలాంటి క్యూఆర్ కోడ్ కలిగిన హోలోగ్రాఫిక్ లేబుల్ బీరు బాటిళ్లపై ఉండదని, ఆ సీసాల మీద ఉన్న క్యూఆర్ కోడ్ సంబంధిత కంపెనీ వారిదేనని పేర్కొన్నారు. ఎక్సైజ్‌శాఖకు సంబంధించిన బార్ కోడ్ కాదన్నారు. బీర్ సీసాలు చల్లగా ఉండటం వల్ల వాటిపై ఎక్సైజ్‌శాఖ లేబులు వేయడానికి సాధ్యం కాదని తెలిపారు. అలాగే నకిలీ బీర్‌ల తయారీకి తక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. అయితే కొంతమంది ఫేక్ వీడియోలు తయారు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అలాంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

డాక్టర్ రమణారావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పీడీసీసీబీ చైర్మన్ సీతారామయ్య, చంద్రశేఖర్ కుటుంబసభ్యులు

నాగులుప్పలపాడు,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా వైద్యులు, ఒంగోలు వెంకటరమణ వైద్యశాల వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ కామేపల్లి వెంకటరమణారావు వర్ధంతిని ఆయన స్వగ్రామమైన హనుమాపురంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రమణారావు ఘాట్ వద్ద ఆయన చిత్రపటానికి కుమారులు పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ చంద్రశేఖర్, కోడళ్లు డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, డాక్టర్ రమాదేవి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించగా సుమారు 500మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అలాగే వారికి ఉచితంగా మందులను అందజేశారు. కాగా రాజకీయ, వైద్య రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై రమణారావుకు నివాళులర్పించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



ఆంజనేయస్వామిని సత్కరిస్తున్న అధ్యాపకులు

సంతనూతలపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాల విద్యార్థులకు మంగళవారం పాండిచ్చేరి యూనివర్సిటీకి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ ఆంజనేయస్వామి వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి విద్యార్థులే రేపటి ఉపాధ్యాయులని, అందువల్ల సబ్జెక్టుకు తగ్గట్టు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. తరగతి గది అనేది సమాచారానికి ఒక మూలము మాత్రమేనని, అదేవిధంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కోరారు. అనంతరం డైట్ ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు అధ్యక్షతన ఆంజనేయస్వామిని సత్కరించారు.

అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధిపైనా దృష్టి సారించాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. అందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని జిల్లా యంత్రాంగం తరుపున అందిస్తానని స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం సాయంత్రం పలు విభాగాల అటవీశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి అటవీశాఖల వివిధ విభాగాల నుంచి ఒకరికి ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. ప్రతినెలా అటవీ భూముల పరిరక్షణకు అవసరమైన సంయుక్త సమావేశం, భూముల జాయింట్ సర్వే జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. జిల్లాకు రెండు విమానాశ్రయాలు రానున్నాయని, వచ్చే ఏడాది ఆగస్టు నాటికి వెలిగొండ ద్వారా నీరు ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన అని కలెక్టర్ చెప్పారు. అవి అందుబాటులోకి వస్తే ప్రకాశం జిల్లా ముఖచిత్రమే మారిపోతుందన్నారు. హైదరాబాద్, అమరావతి, తిరుపతి, బెంగళూరులకు మధ్యలో ఉన్న ప్రాంతం కావడం, నల్లమల పరిధిలో ప్రముఖ క్షేత్రాలు ఉండటం వల్ల భవిష్యత్‌లో మంచి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అంతకు ముందు గిద్దలూరు టైగర్ రిజర్వు డీడీ నిషాకుమారి కలెక్టర్ రాజాబాబును కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి వినోద్‌కుమార్, డీఎఫ్‌వో రాజశేఖర్, మార్కాపురం అటవీశాఖ డీడీ షేక్ మహ్మద్‌అబ్దుల్‌రవూఫ్, జిల్లా పర్యాటక అధికారి శ్రీరమ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ రాజాబాబుకు మొక్కను అందజేస్తున్న డీడీ నిషాకుమారి

నూతన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మేలు

● బీజేపీ రాష్ట్ర కన్వీనర్ సూర్యకళ్యాణ్‌చక్రవర్తి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని బీజేపీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి పేర్కొన్నారు. నూతన జీఎస్టీపై మంగళవారం ఒంగోలులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రత్నదీప్, ఉషోదయ సూపర్ మార్కెట్లో వినియోగదారులతో మాట్లాడి తగ్గిన ధరలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు కోరేది బీజేపీ ప్రభుత్వం అని అన్నారు. జీఎస్టీ శ్లాబులలో మార్పులు చేసినందుకు ప్రధానమంత్రి మోదీ, కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగమూరు రోడ్డులో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, నాయకులు గుర్రం సత్యనారాయణ, అశోకొరెడ్డి, గరికపాటి వంశీకృష్ణ, వర్మ పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న సూర్యకళ్యాణ్‌చక్రవర్తి

'మెడిక్యూర్'లో అరుదైన శస్త్రచికిత్స

● కార్డియాలజిస్ట్ శ్రీధర్‌బాబు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని మెడిక్యూర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం అయినట్లు కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరవది గ్రామానికి చెందిన 83 సంవత్సరాల కె.శేషగిరిరావుకు గుండెలో క్యాల్షియం పేరుకుపోయిందని, స్టంట్ కూడా వేయలేని ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని తెలిపారు. అయితే మొదట హైదరబాద్, విజయవాడకు మెరుగైన వైద్యం కోసం వెళ్లాలని ఆయన కోరగా, కుటుంబ సభ్యులు ఒంగోలులోనే వైద్యం చేయించేందుకు మెడిక్యూర్ హాస్పిటల్‌ను సంప్రదించారన్నారు. కాగా డ్రిల్లింగ్ మెషిన్ లాంటి వైద్యపరికరంతో గుండెలో పేరుకుపోయిన క్యాల్షియంను తొలగించిన అనంతరం స్టంట్‌లు వేశామని డాక్టర్ వెల్లడించారు. కాగా పేషెంట్ వయస్సు రిత్యా సాధ్యం కాని ఆపరేషన్‌ను జిల్లాలోనే తొలిసారిగా విజయవంతం చేసినట్లు చెప్పారు. అత్యాధునిక వైద్యపరికరాలు కలిగిన మెడిక్యూర్‌లో గుండె సంబంధిత వ్యాధులకు మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో హాస్పిటల్ మేనేజర్ దాసరి సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్‌బాబు

గ్రామాలు పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉండాలి

● డీపీవో వెంకటేశ్వరరావు

సంతనూతలపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా, ఆరోగ్యంతంగా ఉండాలని డీపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం సంతనూతలపాడులో శానిటేషన్, తాగునీటి ట్యాంకులను, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం, చెత్త సేకరణ, స్వామిత్వ సర్వేలను ఆయన పరిశీలించారు. తాగునీటి ట్యాంకుల వద్ద ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా తాగునీటిని పరీక్ష చేయించారు. 15రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేయించాలని తెలిపారు. తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయించి కుళాయిల ద్వారా విడుదల చేయాలన్నారు. రాత్రివేళల్లో దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. వర్మీకంపోస్టును పరిశీలించి అమ్మకాలు చేయాలని చెప్పారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తడి, పొడి చెత్తపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొండపిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండపి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొండపి పంచాయతీలో విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలకు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పువ్వాడి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న మాగుంట



ఆలయం వద్ద ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితుల నుంచి ఆయన ఆశీర్వాదాలు స్వీకరించారు. అదేవిధంగా వేదపండితులు మాగుంటలకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

జీఎస్టీ 2.0తో గృహ నిర్మాణ ఖర్చులు ఆదా

పొన్నలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 వలన గృహ నిర్మాణ ఖర్చు పెద్దమొత్తంలో ఆదా అవుతుందని ఎంపీడీవో పి.సుజాత అన్నారు. మంగళవారం స్థానికంగా ఉన్న సిమెంట్ బ్రిక్స్ యూనిట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె జీఎస్టీ వలన ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, ఏఈ కోటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీకాంత్, హౌసింగ్ సూపర్‌వైజర్ సుధీర్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, నాయకులు పల్లపోతు రమేష్‌బాబు, కొండారెడ్డి పంచాయతీ కార్యదర్శి నారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

17న మెగా జాబ్ మేళా : ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద నున్న మహిళాప్రాంగణంలో ఈనెల 17న మెగా జాబ్‌మేళా జరగనున్నట్లు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 10 బహుళ జాతి కంపెనీలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే మేళాకు టెన్త్ నుంచి పీజీ వరకు చదువుకున్న 18-30 సంవత్సరాల వయస్సుగల అభ్యర్థులు హాజరుకావాలని ఆయన కోరారు.

వసతిగృహాల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలి : సీపీఎం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు మంగళవారం స్థానిక రైలుగేటు వద్ద ఉన్న సాంఘిక సంక్షేమబాలుర వసతిగృహాన్ని సందర్శించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడటంతోపాటు హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ 3 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మెనూ చార్జీలు నెలకు రూ.1400 ఇస్తున్నారని, ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు సరిపోవని, అందువల్ల ప్రభుత్వంపెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వసతిగృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చీకటి శ్రీనివాసరావు, బి.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

శ్రీహర్షిణిలో సైబర్‌క్రైంపై అవగాహన



మాట్లాడుతున్న ప్రదీప్

ఒంగోలు విద్య అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ డేటాబేస్ చీఫ్ కౌన్సిలర్లు ప్రదీప్, తిరుమలశెట్టి హేమంత్ విద్యార్థులకు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. హ్యాకింగ్, సేవింగ్, సోషల్ మీడియా, మొబైల్ యాప్‌ల ద్వారా జరుగుతున్న మోసాలను వివరించారు. ఆన్‌లైన్ మోసాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. కార్యక్రంలో కళాశాల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్, డైరెక్టర్ జి.హర్షిత్, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్‌చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రామపిచ్చయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థను బలహీనం చేస్తున్న ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపంపిణీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం బలహీనపరుస్తుందని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఆరోపించారు. రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకుల సరఫరా నిలిపివేయడం ప్రజలపై నేరుగా దాడి చేసినట్లేనని తెలిపారు. సీపీఎం నగర కమిటీ సమావేశం మంగళవారం ఒంగోలులో వీరస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రేషన్‌దుకాణాల ద్వారా బియ్యం, పప్పునూనె, చక్కెర, చింతపండు తదితర నిత్యావసర సరుకులు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక విస్మరించారన్నారు. గత ఏడాదిన్నర కాలంగా రేషన్‌షాపుల్లో కందిపప్పు నిలిచిపోయినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల సరుకులను రేషన్‌షాపుల ద్వారాపంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తంబి శ్రీనివాసులు, టి.మహేష్, బీవీ.రావు, సయ్యద్ హుస్సేన్, దారా వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూరన్‌కుమార్ మృతికి కారకులను అరెస్టు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): హర్యానాలో అడిషనల్ డీజీపీ పూరన్‌కుమార్ బలన్మరణానికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సమితి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. చిత్తూరు జిల్లాకు చెందిన దళితుడైన పూరన్‌కుమార్ నిజాయతీ గల అధికారిగా రాష్ట్రపతి సేవాపతకాన్ని కూడా పొందారని, అనేక అక్రమాలకు వ్యతిరేకంగా ఆయన గళమెత్తడంతో పలువురు సీనియర్ పోలీస్ అధికారులు పగపట్టి వేధించారన్నారు. చివరకు మనస్థాపానికి గురై సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోవడం బాధాకరమని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాటికలపూడి జయరాం, కాకుమానురవి, పిల్లి మాల్యాద్రి, మిట్నసల శాంతారావు, కసుకుర్తి రాజు పాల్గొన్నారు.

వైసీపీ నేతపై దుష్ప్రచారం హాస్యాస్పదం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో వైసీపీ నాయకుడు జోగి రమేష్ ప్రమేయం ఉందంటూ ప్రధాన నిందితుడు అద్దెపల్లి జనార్దన్‌రావు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు ఆరోపించారు. మంగళవారం ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం కేసుపై సీబీఐ దర్యాప్తును ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. జోగి రమేష్ చేసిన సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. అక్రమ మద్యం కేసు నుంచి బయటపడేందుకు వైసీపీ నేతపై దుష్ప్రచారం చేయడం దారుణంగా ఉందని ఆయన విమర్శించారు.

హాస్టల్‌కు తాగునీటి సౌకర్యం కల్పించాలి

కొండపి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో తాగునీటి వసతి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్‌తో కలిసి హాస్టల్‌ను పరిశీలించారు. కళాశాల విద్యార్థులు తమ దృష్టికి అనేక సమస్యలు తీసుకువచ్చారని చెప్పారు. తాగునీటి వసతి కల్పించడంతో పాటు, బాత్‌రూంలను వినియోగంలోకి తీసుకురావాలని , విద్యార్థుల భద్రతకు కేర్ టేకర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



చేతుల శుభ్రత

- పాఠశాలల్లో కనిపించని 'హ్యాండ్ వాష్'
- అవగాహన కల్పించకపోవడంతో అనారోగ్యమే!

ప్రకటనలకే పరిమితమా?

ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచేందుకు ప్రకటించిన పాఠశాలల్లో హ్యాండ్ వాష్ ప్రకటనలకే పరిమితమైంది. నగరంలోని కార్పొరేషన్ పాఠశాలల్లో నీటి కొరత ఏర్పడటంతో చేతులు శుభ్రం చేసుకునే అంశం కార్యరూపం దాల్చడం లేదు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు అవగాహన కల్పిస్తున్నామని చెబుతున్నప్పటికీ అందుబాటులో సరిపడా నీరు లేకపోవడంతో మురికి చేతులతోనే ముద్ద తినాల్సిన దుస్థితి కనిపిస్తోంది. దీంతో ఏడాదికి ఒకసారి మాత్రమే మొక్కుబడిగా హ్యాండ్ వాష్‌పై బక్కెట్ నీటితో అవగాహన కల్పించి ముగించేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు వరల్డ్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం..



చేతులను సబ్బుతో కడుక్కొన్న

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత తెలుగుదేశం పాలనలో పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు, అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రతి ఏడాదీ ఎస్ఎస్ఏ గ్రాంట్ కింద రూ.5వేలు నుంచి రూ.7వేల వరకు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో సబ్బులు, టవల్స్, అవసరమైన సామగ్రి కొనుగోలు చేయాలి. విద్యార్థులకు అందుబాటులో ఉంచడంతోపాటు, భోజనం చేసే ముందు విద్యార్థులు చేతులు కడుక్కుంటున్నారా? లేదా? అని పర్యవేక్షించాలి. కానీ ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే మరిచింది. కనీసం నిధులు కేటాయించకపోగా, ప్రచారం తప్ప పరిశుభ్రతను పట్టించుకున్న వారు లేరు. దీంతో విద్యార్థులు ఉదయం నుంచి పుస్తకాల చేతపట్టి, నోట్సులు రాసి, ఇంకులయిన చేతులతో, డ్రిల్ క్లాసులో చేతికంటిన మంటితోనే అలాగే భోజనానికి కూర్చోవడం కనిపిస్తోంది.

టవల్స్, సబ్బులు లేవు

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల పరిశుభ్రతకు ప్రత్యేక నిధులు కేటాయించారు. తప్పనిసరిగా టవల్స్, సబ్బులు అందుబాటులో ఉంచాలి. మధ్యాహ్నం భోజన సమయంలో తప్పనిసరిగా తర్వాతే భోజనం చేయాలి. అందుకు ఆ పాఠశాలల ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలి. కానీ అలాంటివీ ప్రభుత్వ పాఠశాలల్లో కనిచూపుమేరలో కూడా కనిపించడం లేదు. కేవలం తాగేందుకు మాత్రమే అరకొర నీటిని బబుల్స్ ద్వారా తెప్పిస్తుండగా, కొన్ని పాఠశాలల్లో అసలు తాగునీరు లేక విద్యార్థులు దాహంతో అల్లాడిపోతున్నారు. ఫలితంగా విద్యార్థులకు శ్వాసకోస, టైఫాయిడ్, కలరా, జ్వరం, కామెర్లు, విరేచనాలు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు వెల్లడిస్తున్నారు.

చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలంటే..

ముందుగా అరచేతిని సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తరువాత చేతుల వెనుక భాగం శుభ్రం చేయాలి. అనంతరం వేళ్ల వెనుక మణికట్టు భాగంలో కడగాలి. తర్వాత దశలో చేతి వేళ్ల మధ్య కడగాలి. చివరిగా చేతి వేళ్ల గోళ్లను శుభ్రం చేసుకున్న తర్వాతనే భోజనం చేయాలి. భోజనం చేసే ముందు, మల విసర్జనకు వెళ్లివచ్చిన తర్వాత, ఆటలు ఆడిన తర్వాత, దగ్గినపుడు, తుమ్మినపుడు చేతులు అడ్డుపెట్టుకోవడం ద్వారా క్రిములు చేతికి అంటుకునే ప్రమాదం ఉంది. అందువల్ల శుభ్రత చాలా ముఖ్యం.

గ్రామాల అభివృద్ధి బాధ్యత కార్యదర్శులదే

- ప్రజారోగ్యం, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి
- కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమగ్రాభివృద్ధి, సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని కలెక్టర్ రాజాబాబు అన్నారు. ఈ విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం ఒంగోలు డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించడంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. పంచాయతీకి సంరక్షణ అధికారిగా (కస్టోడియన్) కార్యదర్శులపై తమ పరిధిలోని ప్రభుత్వ భూములు అక్రమణలకు గురికాకుండా కాపాడాలన్నారు. రెవెన్యూకు సంబంధించిన అంశమని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగునీటి సమస్య కేవలం ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి మాత్రమే చెందినదిగా అనుకోవద్దని, స్థానిక పరిస్థితులపై పంచాయతీ కార్యదర్శుల సమగ్ర పరిశీలన అవసరమని అన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ తదితరులు ఉన్నారు.



పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- 16న పీఎం శ్రీశైలం రూట్లు మార్పు
- దోర్నాల - శ్రీశైలం, గుంటూరు - కర్నూలు వెళ్లే వాహనాల మళ్లింపు
- మార్కాపురం డీఎస్పీ నాగరాజు

పెద్ద దోర్నాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం పుణ్యక్షేత్ర సందర్శనకు ఈనెల 16వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వస్తుండటంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ ప్రధాని పర్యటన నేపథ్యంలో 16వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే వాహనాలను దోర్నాల వద్దే నిలిపివేయనున్నామని, ఈ విషయాన్ని యాత్రికులు గమనించాలని ఆయన కోరారు. గుంటూరువైపు నుంచి కర్నూలు వెళ్లే వాహనాలను పెద్దారవీడు కుంట జంక్షన్ వద్ద దారి మళ్లించి గిద్దలూరు, నంద్యాల మీదుగా వెళ్లేలా రూట్ మార్చినట్లు చెప్పారు. కర్నూలు వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే యాత్రికులు కూడా వీలైనంత వరకు ఆరోజు ప్రయాణం వాయిదా వేసుకోవడం ఉత్తమమన్నారు. అప్పటికే ప్రయాణం చేసి దోర్నాల వచ్చిన వారు మాత్రం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి ఉండాల్సిందేనని, ఇందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ రావు, ఎస్సై మహేశ్ పాల్గొన్నారు.

మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి
రైతు ఆత్మహత్య

ముండ్లమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూజెండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు వెంగళశెట్టి వెంకటేశ్వర్లు (50) మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. వెంకటేశ్వర్లుకు రెండెకరాలు పొలముంది. సేద్యంలో నష్టాలు రావడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఏ పనిచేసినా కలిసి రావడం లేదనే ఆత్మన్యూనతతో దిగులు పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈనెల 8వ తేదీ మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00






డోన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల


పాణ్యం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

కర్నూలులో కీలకంగా..

కర్నూలులో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయడంలో ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ నేతలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరు అక్కడి ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కీలక నేతలతో కలిసి సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు సమీప నియోజకవర్గాల నుంచి జన సమీకరణ ఏర్పాట్లలో నిమగ్నమై పనిచేస్తున్నారు. అలాగే కర్నూలు సభ కోసం జిల్లా నుంచి 160 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. అదేవిధంగా శ్రీశైలం మల్లన్న దర్శనానికి మోదీ వస్తున్న నేపథ్యంలో పెద్దదోర్నాల నుంచి ఘాట్ రోడ్డులో పోలీసు ఆంక్షలు కొనసాగుతున్నాయి.

- ప్రధాని పర్యటన బాధ్యతల్లో ఉమ్మడి జిల్లా నేతలు
- భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు
- రేపు నరేంద్ర మోదీ జీఎస్టీ సభ
- ఆరోజు దోర్నాల వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

ఒంగోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ కర్నూలు జిల్లా పర్యటన ఏర్పాట్లలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. జీఎస్టీలో సంస్కరణలు తెచ్చి అనేక రకాల వస్తువులపై పన్నులు తగ్గించిన అనంతరం దేశవ్యాప్తంగా సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో పెద్దఎత్తున సభలు నిర్వహించి ప్రజలకు సంస్కరణల ఫలితాలు వివరించాలని కేంద్రం నిర్ణయించిన విషయం విదితమే. ఆ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇక్కడి ప్రభుత్వం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. అదే సమయంలో దేశంలో ఈ అంశంపై ప్రధాని మోదీ పాల్గొనే తొలిసభను రాష్ట్రంలో ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సంకల్పించారు. అందుకు వేదికగా కర్నూలును ఎంపిక చేశారు. ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం కర్నూలు నగర సమీపంలో ఈ సభ జరగనుంది. లక్షలాది మంది ప్రజలు హాజరయ్యేలా చూడటంతోపాటు సభా ప్రాంగణంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు సంబంధించి ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలకు అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. దీంతో రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ తదితరులు అక్కడే మకాం వేసి పనిచేస్తున్నారు.

నియోజకవర్గాల్లో పర్యటనలు

తొలి రోజున సభాప్రాంగణంలో ఏర్పాట్లు, ముఖ్యనేతలు, అధికారులతో జరిగిన సమీక్షల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన నేతలు మంగళవారం జనసమీకరణ చర్యలలో భాగంగా పలు నియోజకవర్గాల్లో పర్యటించారు, పాణ్యం నియోజకవర్గంలో అక్కడి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. డోన్ నియోజకవర్గంలో అక్కడి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పరిశీలకుడిగా పాల్గొన్నారు. కోడుమూరు నియోజకవర్గ టీడీపీ సమావేశంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొని ప్రధాని సభకు జనసమీకరణపై అక్కడి పార్టీశ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా స్థానికంగా ప్రజలను కదిలించే అంశంపై అక్కడి నాయకులతో చర్చించారు. పలువురు రాష్ట్ర మంత్రులు, కీలక నేతలతో కలిసి ప్రధాని సభ జరిగే ప్రాంగణంలో ఏర్పాట్ల పర్యవేక్షణలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు.

అప్రమత్తమైన పోలీసులు

ప్రధాని నరేంద్రమోదీ గురువారం శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానాన్ని సందర్శించనున్నారు. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. శ్రీశైలం బందోబస్తుకు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో పోలీసులు వెళ్తున్నారు. మరోవైపు శ్రీశైలం వెళ్లే మార్గంలో దోర్నాల కీలక ప్రాంతం కాగా అక్కడ కూడా పోలీసులు మకాం వేస్తున్నారు. దోర్నాల వద్ద ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు. కర్నూలు జిల్లా నుంచి ఇటు పల్నాడు ప్రాంతం, మార్కాపురం వైపు నుంచి శ్రీశైలం నుంచి వచ్చే వాహనాలన్నింటినీ 16వతేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దోర్నాల వద్దనే నిలిపివేసేలా జిల్లా పోలీసులు చర్యలు చేపట్టారు. పల్నాడు ప్రాంతం నుంచి కర్నూలు వైపు వెళ్లే వాహనాలను పెద్దారవీడు మండలం కుంట నుంచి గిద్దలూరు, నంద్యాల వైపు మళ్లిస్తున్నారు. అలాగే నల్లమల అటవీ ప్రాంతంలోనూ ముమ్మరంగా తనిఖీలు కొనసాగిస్తున్నారు.



ప్రధాని పర్యటనకు 160 ప్రత్యేక బస్సులు

- రీజియన్ నుంచి సిద్ధం చేసిన ఆర్టీసీ అధికారులు
- రెండు రోజులపాటు పలు సర్వీసులు నిలుపుదల
- ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో ప్రధాని మోదీ పాల్గొంటున్న సభకు ఆర్టీసీ ప్రకాశం రీజియన్ నుంచి 160 బస్సులను కేటాయించింది. ప్రజలతోపాటు అధికారులు, పోలీసులను సభకు తరలించేందుకు వీటిని ఏర్పాటు చేసింది. ఈ బస్సులు ఈనెల 15, 16 తేదీలలో కర్నూలు జిల్లాకే పరిమితమవుతాయి. ఈనేపథ్యంలో ఆర్ఎం సత్యనారాయణ నేతృత్వంలో జిల్లాలోని ఐదు డిపోల మేనేజర్లు సమావేశమై ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి రెండు రోజులపాటు సహకరించాలని కోరారు.


నాగులవరం రోడ్డులో కంప తొలగించి అమ్మకాలకు సిద్ధం చేస్తున్న వెంచర్

ఆశలకు రెక్కలు

మార్కాపురం జిల్లా, వెలిగొండ, మెడికల్ కాలేజీలపై ప్రభుత్వం స్పష్టత

- చకచకా సాగుతున్న పనులు
- ఊపందుకుంటున్న రియల్ వ్యాపారం
- పట్టణం చుట్టూ వెంచర్లు

మార్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. మార్కాపురం జిల్లా ఏర్పాటుపై స్పష్టత ఇచ్చింది. వెలిగొండ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మెడికల్ కాలేజీకి టెండర్లు పిలిచారు. రిలయన్స్ సీబీజీ ప్లాంట్లకు భూసేకరణ పూర్తయ్యింది. ఇన్ని అనుకూల పరిస్థితుల నేపథ్యంలో మార్కాపురంలో రియల్ వ్యాపారానికి జవసత్వాలు వచ్చాయి. ప్రస్తుతం పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా స్థలాల కొనుగోలు, అమ్మకాలు ఊపందుకున్నాయి. నూతన వెంచర్లతోపాటు గతంలో వేసిన వాటిని కూడా మళ్లీ శుభ్రం చేయించి విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నారు.

రెండేళ్ల తర్వాత మళ్లీ ఊపు

మార్కాపురంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గత రెండేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా మందగించింది. క్రయ విక్రయాలు అంతంత మాత్రంగానే సాగాయి. ఈక్రమంలో ప్రస్తుతం మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యమని ప్రభుత్వం, పాలక పెద్దలు స్పష్టం చేస్తున్నారు. ఈ సంవత్సరం చివరికి లేదా 2026 ఆరంభానికల్లా జిల్లా ఏర్పాటు ఖాయమని ఉన్నత స్థాయి వర్గాలు చెబుతున్నాయి. అలాగే పశ్చిమ ప్రకాశానికి అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టుకు ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించింది. ఫీడర్ కెనాల్‌లో లైనింగ్ పనులు చేసేందుకు రూ.456కోట్లు మంజూరు చేసింది. వైసీపీ హయాంలో ప్రారంభించి మధ్యలోనే నిలిచిపోయిన మెడికల్ కాలేజీని పీపీపీ పద్ధతిలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. తాజాగా కేంద్ర రక్షణ శాఖ మార్కాపురానికి సమీపంలోని దొనకొండలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇవేకాక రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో సీబీజీ ప్లాంట్లు కూడా మార్కాపురం నియోజకవర్గంలో ఏర్పాటుకు భూసేకరణ జరిగింది. ఈ విధంగా మార్కాపురం అభివృద్ధివైపు అడుగులు వేసేందుకు అన్నివైపుల నుంచి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంటోంది.

నూతన వెంచర్లతో రియల్ వ్యాపారం కళకళ

కొత్త జిల్లా ప్రకటనలతో మార్కాపురం పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రస్తుతం నూతన వెంచర్లు వెలుస్తున్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారిని ఆనుకుని, రైల్వే స్టేషన్ రోడ్డు, తర్లుపాడు రోడ్డు, కంభం రోడ్డు, రాయవరం, వేములకోట, దరిమడుగు గ్రామాల చుట్టూ వెంచర్లు వేస్తున్నారు. రెండు నెలల వ్యవధిలోనే సుమారు 500 ఎకరాల్లో వెంచర్లు వేసినట్లు సమాచారం. నూతన వెంచర్లతోపాటు గతంలో వేసి మధ్యలో నిలిచిపోయిన వాటిపై కూడా వ్యాపారులు దృష్టి సారించారు. వాటిలో మొలిచిన పిచ్చిచెట్లను తొలగించే పనులు చురుగ్గా చేపట్టారు. పట్టణంలోని కొన్నిచోట్ల అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు కూడా జోరందుకున్నాయి. ఈ పరిణామాలు స్థిరాస్తి వ్యాపారుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.



2

గ్రామాల అభివృద్ధి బాధ్యత కార్యదర్శులదే

- ప్రజారోగ్యం, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి
- అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి
- భూములను కాపాడాలి
- నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు
- శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు



చేతుల శుభ్రత ప్రకటనలకే పరిమితమా?

- స్కూళ్లలో కనిపించని 'హ్యాండ్ వాష్'
- టవల్స్, సబ్బులు లేవు
- అవగాహన లేక విద్యార్థులు అనారోగ్యం పాలు
- నేడు హ్యాండ్ వాష్ దినోత్సవం

2

కార్మికుల పక్షపాతి అమిరుల్లా ఖాన్



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు వీరబ్రహ్మం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూ కార్మిక పక్షపాతిగా అమిరుల్లా ఖాన్ హృదయాల్లో నిలిచారని టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు శాసనాల వీరబ్రహ్మం అన్నారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి షేక్ కాశిం అధ్యక్షతన మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు జీప్ మోటార్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పఠాన్ అమిరుల్లా ఖాన్ సంతాప సభ మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీరబ్రహ్మం మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితంలో ప్రజా సమస్యల కోసం పోరాడుతూ అదే విధంగా జీపు కార్మికులకు అండగా అమిరుల్లా ఖాన్ నిలిచారన్నారు. సీపీఐ నాయకులు అందె నాసరయ్య మాట్లాడుతూ.. జీప్ స్టాండ్ కోసం ఖాన్ కృషి చేశారని, డ్రైవర్లు చనిపోతే తన తరఫున రూ.10వేల ఆర్థిక సాయం చేసేవారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌యూసీసీ సభ్యులు నారాయణరెడ్డి, ప్రయాణికుల సంఘ నాయకుడు ఆర్‌కేజే నరసింహం, అమిరుల్లా ఖాన్ కుమారుడు పఠాన్ మొహిసీన్ ఖాన్, కార్మికులు పాల్గొన్నారు.

ఆత్మ నిర్భర్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో జరిగిన ప్రతి ఇంటా స్వదేశీ, ఇంటింటా స్వదేశీ (ఆత్మ నిర్భర్ భారత్) కార్యక్రమానికి స్థానిక బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు, నాయకులు ఎం.పుల్లయ్య, వెంకటరామిరెడ్డి తదితరులు కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పడాలి

పెద్ద దోర్నాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు తోడ్పడాలని ఎంఈవో మస్తాన్ నాయక్ కోరారు. మండలంలోని పలు పాఠశాలలను ఎంఈవో మంగళవారం సందర్శించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనం చేరిన 12మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చిన 16మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరిన ముగ్గురు, గురుకుల పాఠశాలలలో చేరిన 14మంది, ఆశ్రమ పాఠశాలలో చేరిన 5మంది, ఏపీ మోడల్ పాఠశాలకు ఐదుగురు మొత్తం 68 మంది ఉపాధ్యాయులనుద్దేశించి సూచనలు చేశారు.

వైసీపీ పోరుబాట

గిద్దలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యంపై వైసీపీ పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక రాచర్లగేటు సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి సీఐకి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో వైసీపీ మున్సిపల్‌శాఖ అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు బత్తెం ఓబులరావు, వైసీపీ నాయకులు సూరా స్వామిరంగారెడ్డి, చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధం

కంభం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాయితీ శనగ విత్తనాల కోసం మండలంలోని రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్ తెలిపారు. కంభం మండలానికి 1150 క్వింటాళ్ల శనగ విత్తనాలు కేటాయించారన్నారు. విత్తనాలు కావలసిన వారు రైతు సేవా కేంద్రంలో సంప్రదించి తీసుకోవాలన్నారు. ఆధార్, పొలం పాస్ పుస్తకం, సెల్ ఫోన్ నెంబరుతో సంప్రదించాలని సూచించారు. క్వింటా శనగ విత్తనాల ఖరీదు రూ.7800, రాయితీ రూ.1950 కాగా రైతు రూ.5850 చెల్లించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు.

పేర్లు నమోదు చేసుకున్న రైతులకే శనగలు

రాచర్ల : శనగల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకే విత్తనాలను పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ ఏవో షేక్ మహబూబ్ బాషా అన్నారు. మంగళవారం దాదాపు 80శాతం మంది రైతులు తమ తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో శనగల కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారని వారందరికీ విత్తనాలను అందజేస్తామని తెలిపారు. ఇంకా అవసరమైన వారు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, మొబైల్‌తో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. రెండు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2500హెక్టార్లలో రైతులు శనగ సాగుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

వివాదాస్పద భూమి పరిశీలన

మార్కాపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇడుపూరు గ్రామ పరిధిలో వివాదంలో ఉన్న అసైన్డ్ భూమిని మంగళవారం తహసీల్దార్ చిరంజీవి సిబ్బందితో కలిసి పరిశీలించారు. భూమి సమస్య పరిష్కారం కోసం తాళ్లపల్లి వెంకట సుబ్బారావు, రాచకొండ యలమందయ్య తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన ఆ భూమిని పరిశీలించారు.

సగిలేరులో ఈతకు వెళ్లి యువకుడు మృతి

ఐదుగురిలో ఒకరు మృతి


ఆసిఫ్

గిద్దలూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సగిలేరునదిలో ఈతకు వెళ్లిన స్నేహితులలో ఒకరు మృత్యువాత పడ్డారు. ఈతకు వెళ్లిన ఐదుగురిలో ఇద్దరు అన్నదమ్ములు ఉండగా అన్న మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు గిద్దలూరు శివారులోని కొండపేట ఆంజనేయస్వామి దేవాలయం వెనుక గల సగిలేరువాగులో మంగళవారం సాయంత్రం పట్టణంలోని రామాలయం వీధికి చెందిన సయ్యద్ ఆసిఫ్, తమ్ముడు సయ్యద్ అనుతోపాటు మరో ముగ్గురు స్నేహితులు కలిసి ఈతకు వెళ్లారు. అందరూ వాగులో దిగి ఈత కొడుతున్నారు. ఆ వాగు వద్ద ఎక్కువ లోతు ఉండడంతో ఆసిఫ్ (22) కనిపించలేదు. తమ్ముడు అనుతోపాటు ముగ్గురు స్నేహితులు ఒడ్డుకు చేరి ఆసిఫ్ జాడ తెలియకపోవడంతో కేకలు వేశారు. చుట్టుపక్కల ఉన్న స్థానికులు ఆప్రాంతానికి చేరుకుని గాలింపు మొదలుపెట్టారు. దీంతోపాటు సమాచారం అందుకున్న అర్బన్ సీఐ కె.సురేష్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది గాలించగా ఆసిఫ్ కొన ఊపిరితో ఉండడంతో సీఐ సురేష్ తన వాహనంలో హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆసిఫ్‌కు సీపీఆర్ చేసినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువకుడు మృతితో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. ఆసిఫ్ తండ్రి అటవీశాఖ కార్యాలయంలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు.

బురదలో ఇరుక్కుపోయిన మినీ లారీ

రాచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగపేట జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామాల మధ్య మొక్కజొన్న కంకులతో వెళుతున్న మినీ లారీ ప్రమాదవశాత్తు బురదలో ఇరుక్కుపోయింది. ఇటీవల కురిసిన వర్షాల వలన మట్టి రోడ్డు బురదమయంగా మారింది. దీంతో ఈ ఘటన జరిగింది. మినీ లారీ ఇరుక్కుపోవడంతో కంభం-గిద్దలూరు వయా కృష్ణాపురం, సోమిదేవిపల్లి గ్రామాల మీదుగా తిరిగే ఆర్టీసీ బస్సు, మరి కొన్ని వాహనాలకు తీవ్ర అంతరాయం కలిగింది.











చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

బాలికలు చట్టాలను తెలుసుకోవాలి

రాచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలికలు చట్టాల గురించి తెలుసుకోవాలని గిద్దలూరు సీడీపీవో మహిత అన్నారు. రాచర్ల గురుకుల పాఠశాలలో మంగళవారం ఆమె బాల్య వివాహ పోక్సో యాక్ట్, బాల కార్మిక నిరోధక చట్టాలు, సైబర్ నేరాలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. అనంతరం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పలుగుంటిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లులతో సమేకమై విద్యాభివృద్ధి, మానసిక ఎదుగుదల, తదితర అంశాలపై మాట్లాడారు. కిషోర బాలికల అంగన్‌వాడీ చిన్నారుల విషయంలో సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, ఒంగోలు ఐసీడీఎస్ శ్రీలక్ష్మి, రాచర్ల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వసంత కుమారి, ఏఎస్సై పై శ్రీనివాసరావు, కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కార్యాలయానికి తాళం వేసిన బాధితుడు

బంగారు ఆభరణాలను ఆక్షన్‌లో అమ్మేసిన సంస్థపై ఫిర్యాదు

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తనకు తెలియకుండా తన బంగారాన్ని ఆక్షన్ ద్వారా అమ్మకాలు చేయడంపై ఆగ్రహంతో ఆ కార్యాలయానికి తాళం వేసి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం ఎర్రగొండపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన చేవూరి రాజశేఖర్ స్థానిక ఆశీర్వాద్ గోల్డ్‌లోన్ ఫైనాన్స్ కార్యాలయంలో 6 దఫాలుగా సుమారు 101 గ్రాముల బంగారాన్ని తాకట్టు పెట్టి నగదు తీసుకున్నారు. అయితే తన బంగారం తీసుకెళ్తానని కార్యాలయ సిబ్బందిని అడిగితే గత మూడు నెలల నుంచి తిప్పుతూ బంగారం ఆక్షన్ ద్వారా అమ్మేసినట్లు సిబ్బంది చెప్పడంతో మంగళవారం కార్యాలయానికి తాళం వేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పీ చౌడయ్య తెలిపారు.

యువకుల మృతి బాధాకరం

ఎమ్మెల్యే కందుల

పొదిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎదురాళ్లపాడు గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకులు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో ఇద్దరి మృతదేహాలకు నివాళులర్పించారు. మార్కాపురం మండలం చింతగుంట గ్రామానికి చెందిన గణేష్, అవినాష్ ట్రాక్టర్‌ను ఢీకొని మృతి చెందడం కలచివేసిందన్నారు. వాహనాలు నడిపే వారు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని కందుల సూచించారు. కుటుంబానికి ఆసరాగా ఉండాల్సిన యువకులు మృతి చెందడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆరెండు కుటుంబాలను ఆదుకునేందుకు తన వంతు సహకారం అందిస్తానని ధైర్యం చెప్పి ఓదార్చారు. ఆయన తోపాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, ఏఎంసీ డైరెక్టర్ రోళ్ల శ్రీను, నాయకులు ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులు, వైద్యులతో మాట్లాడుతున్నఎమ్మెల్యే కందుల

విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కంభం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై అవగాహన పెంచచుకోవాలని ఎంఈవో అబ్దుల్ సత్తార్ అన్నారు. జన విజ్ఞాన వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఎంఈవో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇటువంటి పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జన విజ్ఞాన వేదిక కంభం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వరికుంట్ల వెంకటేశ్వర్లు, నారప రెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఈనెల 18వ తేదీన జరిగే పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో పాల్గొనేలా చూడాలన్నారు. నవంబర్ 1వ తేదీన మండల స్థాయి, 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12, 13, 14 తేదీలలో రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాలు జరుగుతాయని, అందరూ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చెకుముకి కన్వీనర్ షేక్ నాయబ్ రసూల్, కోశాధికారి మస్తాన్, ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్, యూత్ కన్వీనర్ జావిద్, పాఠశాల సిబ్బంది నూర్జహాన్ బేగం, శరబమ్మ, విజయలక్ష్మి, సత్యరామారావు, సుబ్రహ్మణ్యం, సలీంబాషా, రమణారెడ్డి, శ్రీకృష్ణ, రంగనాయకులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సేవలు సక్రమంగా అందించాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సచివాలయాలలో ప్రజలకు సేవలు సక్రమంగా అందించాలని తహసీల్దార్ చిరంజీవి అన్నారు. పట్టణంలోని బాపూజీ కాలనీ 9వ సచివాలయాన్ని తహసీల్దార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఆలస్యం జరగకుండా చూసుకోవాలన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

పెద్ద దోర్నాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షలపై వ్యవసాయ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. తొలుత చినగుడిపాడు, కటకానిపల్లె గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్రం అధికారి వీవీ శేషమ్మ రైతులకు భూసారా పరీక్షలు, తద్వారా సాగు చేయాల్సిన పంటలు, ఫలితాలుపై అవగాహన కల్పించారు. అనంతరం తిమ్మాపురంలోని ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు భూసార పరీక్షలు చేయాల్సిన తీరు, తద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ కాలువలో చేపలపట్టే వ్యక్తి గల్లంతు

తాళ్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలుగువారిపాలెం సమీపాన రెడ్డి సాగర్ వద్ద ఒంగోలు బ్రాంచి కాలువలో చేపలు పట్టుకుంటున్న వ్యక్తి ప్ర మాదవశాత్తు గల్లంతయ్యాడు. పొదిలి మండలం కాటూరివారిపాలేనికి చెందిన మెలిక ప్రసాద్(45) ఓబీసీకాలువలో చేపలు పడుతుండగా మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న బంధువులు అక్కడకు చేరుకుని సమీపానే ఉన్న కాలువ గేట్లను దిగువకు దించి, అధికారులతో మాట్లాడి నీటి విడుదల సామర్థ్యాన్ని తగ్గించి వెదుకులాడారు. సాయంత్రం 6గంటలు దాటినా ఆచూకీ తెలియలేదు. వీఆర్‌వో చిన్నికృష్ణయ్య ఈ విషయాన్ని తహసీల్దార్ బి.వి.రమణారావు, ఎస్సై మల్లికార్జునరావులకు తెలియజేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. చేపలు పట్టడమే జీవనాధారంగా బతుకున్న కుటుంబ యజమాని గల్లంతు కావటంతో కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రచార పిచ్చి వదిలి ప్రజల కోసం పనిచేయాలి

త్రిపురాంతకం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రచార పిచ్చిని విడిచి ప్రజల కోసం ఎమ్మెల్యే చంద్రశేఖర్ పనిచేయాలని టీడీపీ మండల కన్వీనర్ మేకల వలరాజుయాదవ్ అన్నారు. ప్రచార పిచ్చి వదిలి ప్రజల కోసం నిలబడాలని హితవు పలికారు. ఒకవైపు టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సాధిస్తూ పనులు మంజూరు చేయించి వాటిని పూర్తి చేసేలా కృషి చేస్తుంటే నిత్యం ఎమ్మెల్యే ఏదో ఒక కార్యక్రమం పేరుతో వైసీపీ కార్యకర్తలను పోగేసుకుని వారి అనుకూల మీడియాలో కనిపించాలనే తాపత్రయం ఎక్కువైందన్నారు. కల్తీ మద్యంపై నిరసన పేరుతో ఆయన హడావుడి చేయడాన్ని ప్రజలు పట్టించుకోలేదన్నారు. నియోజకవర్గంలో వైసీపీ నాయకులకు కూడా ఆయన ప్రచార పిచ్చి తెలిసిపోయిందని వలరాజుయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.











మహిళల పట్ల వైసీపీ నేతలు అవమానకర వ్యాఖ్యలు దారుణం


డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : మహిళల పట్ల వైసీపీ నాయకులు అవమానకర వ్యాఖ్యలు చేయటం దారుణమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మంగళవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి డీఎన్‌ఏలోనే నైతిక విలువలు లేవని విమర్శించారు. వినుకొండ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలకు సమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీ నాయకులు మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళల ఆగ్రహాన్ని చవిచూస్తారని హెచ్చరించారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు శుభపరిణామం

రాష్ట్రంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం పలకటం శుభపరిణామని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. విశాఖలో రూ.87 వేల కోట్లతో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థ నిర్ణయించటంతో రాష్ట్ర ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. యువతకు పుష్కలంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు.

నేడు మహాకుంభాభిషేకానికి ముస్తాబైన శివాలయం

నాభిశిల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


ముస్తాబైన శివాలయం

ముండ్లమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లు గ్రామంలో శ్రీ అన్నపూర్ణ కాశీవిశేశ్వరస్వామి కుంభాభిషేకంతో పాటు నాభిశిల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం జరగనుంది. ఈనెల 11వ తేదీ నుంచి గణపతి పూజా కార్యక్రమం నుంచి నాలుగు రోజుల పాటు వివిధ పూజలు నిర్వహించారు. పసుపుగల్లు గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎస్‌ఐ కే కమలాకర్ మూడు రోజుల నుంచి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం

ముండ్లమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పులిపాడు, బంగారమ్మగుట్ట, రెడ్డినగర్, బసవాపురం, నందమూరి నగర్, శ్రీనివాస నగర్, జగన్‌నగర్ గ్రామాల్లో భారీ వర్షం పడింది. ముండ్లమూరు, వేంపాడు, పసుపుగల్లు గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది.

నేడు దర్శిలో కరెంట్ సరఫరా నిలిపివేత

దర్శి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డు, కురిచేడు రోడ్డు, చౌటపాలెం రోడ్డు, టీచర్స్ కాలనీ, శివరాజ్‌నగర్, పొదిలి రోడ్డు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ ఏ సచిన్ కుమార్ తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

'దొనకొండ'కు 14,102 స్మార్ట్ రేషన్ కార్డులు


స్మార్ట్ రేషన్‌కార్డు అందజేస్తున్న ఆంజనేయులు, తహసీల్దార్ రమాదేవి

దొనకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాత రేషన్‌కార్డుల స్థానంలో ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్‌కార్డులు మండలంలోని 28 రేషన్‌షాపుల పరిధిలో 14,102 కార్డులు తహసీల్దార్ కార్యాలయానికి చేరాయి. వాటిని తహసీల్దార్ రమాదేవి రేషన్ డీలర్ల ద్వారా లబ్ధిదారులకు అందించే కార్యక్రమం ముమ్మరంగా చేపడుతున్నారు. డీలర్లు స్మార్ట్ కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఈపోస్ మిషన్‌లో అప్‌డేట్ చేసుకొని లబ్ధిదారుల ఫింగర్ బయోమెట్రిక్ వేయించుకొని స్మార్ట్ కార్డు అందజేస్తున్నారు. సచివాలయ ఉద్యోగి.. లబ్ధిదారుడి ఫేస్ లేదా ఆధార్ ఓటీపీ ద్వారా కార్డు పొందినట్లు యాప్‌లో సబ్మిట్ చేసి కార్డు డెలివరీ చేసేలా అధికారులు నిర్దేశించినట్లు సమాచారం. కానీ మండలంలోని పలు రేషన్ షాపుల పరిధిలో సచివాలయాల ఉద్యోగులు ఈ కార్యక్రమానికి సహకరించటం లేదనే ఆరోపణలున్నాయి. సచివాలయ సిబ్బంది ఎప్పుడు ఆథరైజేషన్ చేస్తారో రేషన్‌కార్డు ఎప్పుడు యాక్టీవ్‌లోకి వస్తుందో అని పలువురు చర్చించుకుంటున్నారు.

పేద, మధ్య తరగతి వర్గాలకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనకరం


మాట్లాడుతున్న ఎంపీడీవో అజిత

తాళ్లూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి జీఎస్టీ తగ్గింపు ప్రయోజనకరంగా ఉంటుందని ఎంపీడీవో పి.అజిత, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీకమిషనర్ సుధాకర్ చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు మెరుగైన సేవింగ్స్ జరుగుతాయన్నారు. ప్రతిగృహానికి తక్కువ ధరలో ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎంఎస్ఎంఈల వస్తువులు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వర రెడ్డి, మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడు గొంది రమణారెడ్డి, సర్పంచ్ కాలేషావలి, రామయ్య, రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ ద్వారా విద్యుత్ బకాయిలపై దృష్టి సారించాలి

ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులు


రికార్డులు పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులు

ముండ్లమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బకాయిలు వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పాలగిరి శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం ఆయన స్థానిక సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బకాయిల జాబితాను పరిశీలించారు. దాదాపు రెండు కోట్ల మేర విద్యుత్ బకాయిలు పేరుకు పోయాయన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఈ నెలాఖరుకల్లా 50 శాతం మేర వసూలు చేయాలని చెప్పారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ చినఅంకబాబు, లైన్ ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్‌లు పీ ఆంజనేయులు, సోమ్లా నాయక్ ఉన్నారు.

సీఎస్‌పురంలో యూటీఎఫ్ సభ్యత్వ కార్యక్రమం


సభ్యత్వం ఇస్తున్న యూటీఎఫ్‌నేతలు

సీఎస్‌పురం(పామూరు) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ హైస్కూళ్లలో విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులను యూటీఎఫ్ యూనియన్ నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ వెంకటరామయ్య, షేక్ పాదుషాలు కలిసి వారిని యూటీఎఫ్‌లో సభ్యులుగా చేర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వేమా నారాయణ, జె. వెంకటరావు, కె. నాగరాజు, బి.వి.ఎస్ రమేష్ పాల్గొన్నారు.

పూర్వపు ప్రాథమిక విద్య అంగన్వాడీ కేంద్రంలోనే..

కనిగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :పూర్వపు ప్రాథమిక విద్య అంగన్వాడీ కేంద్రంలోనే లభ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతమ్మ చెప్పారు. మండలంలోని అలవలపాడులో మంగళవారం పోషక మాసం కార్యక్రమంలో పోషకాహార లోగోను ప్రదర్శించారు.

ఉరేసుకుని నవవధువు ఆత్మహత్య

వెలిగండ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం గండ్లోపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణపావని వివరాల మేరకు... గండ్లోపల్లికి చెందిన కౌసల్య(19) అదే గ్రామానికి చెందిన తోకల రామాంజితో 20 రోజుల క్రితం వివాహమైంది. వారి మధ్య కొద్దిరోజుల్లోనే కుటుంబ కలహాలు తలెత్తడంతో కౌసల్య మనస్తాపం చెందింది. మంగళవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు పొలానికి వెళ్లగా తలుపులు బిగించుకొని చీరతో ఫ్యాన్‌కి ఉరేసుకుని మృతి చెందింది. పొలం నుంచి వచ్చిన తల్లిందండ్రులు తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లే సరికి ఫ్యాన్‌కి వేలాడుతూ కనిపించింది. సమాచారం అందిచడంతో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతన్నలకు అండగా ప్రజాప్రభుత్వం

అవీఇవీ


రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్న శ్రీనివాసులు

పామూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతల శ్రేయస్సు కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు చెప్పారు. మండలంలోని నుచ్చుపొద గ్రామ సచివాలయంలో సబ్సిడీపై నుచ్చుపొద, తిరగళదిన్నె గ్రామాలకు చెందిన పలువురు రైతులకు యూరియాను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కామేపల్లి సూర్యప్రకాష్‌రావు, ఇర్రి కోటిరెడ్డి, మండ్ల మల్లికార్జున, ఇర్రి శ్రీనివాసులు, వంకదారి వెంకటేశ్వర్లు, వీపీఏ నూరి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న ఏపీవో మాల్యాద్రి

పామూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో జాబు కార్డులు కలిగి ఉన్న కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో మాల్యాద్రి చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు మందిరంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ కూలీలు ఈకేవైసీ చేయించుకోవడం వలన దొంగ మస్టర్లు నివారించవచ్చునని చెప్పారు. పనులు జరుగుతున్నప్పుడు ఉదయం ఒక ఫొటో నాలుగు గంటల తరువాత మరో ఫొటో తీయాలన్నారు. సమావేశంలో టీఏలు, ఎఫ్ఐలు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు చెక్


రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

పామూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్‌కార్డుతో రేషన్ అక్రమాలకు చెక్ పడుతుందని ఏఎంసీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలోని తూర్పు కట్టకిందపల్లిలో క్యూఆర్‌కోడ్‌తో తయారు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం రేషన్ కార్డుదారులకు అంద చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీనేతలు పెద్దిశెట్టి శ్రీనివాసులు, నీరుకట్టు శ్రీనివాసులు, వీఆర్వో సరస్వతి పాల్గొన్నారు. కాగ మండలంలోని రేగిచెట్లపల్లి గ్రామంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బత్తుల మస్తాన్‌రావు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అమ్ముాలూరి సుధాకర్‌రావు, బూత్ కన్వీనర్ పెనుబాకుల వెంకట్రావు, ప్రసాద్‌రెడ్డి, రేషన్ డీలర్ ఇల్లూరి శ్రీనివాసరెడ్డి, గవిరెడ్డి కొండారెడ్డి, గాజులపల్లి జనార్దన్,తదితరులు పాల్గొన్నారు.

ఒకరి ప్రాణం తీసిన రాంగ్ రూట్



ఒంగోలు క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్‌లో మినీ వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన కర్నూలు రోడ్డులో మలాస చికెన్ షాప్ వద్ద మంగళవారం జరిగింది. కరవదికి చెందిన లారీ యజమాని సింగిశెట్టి వెంకటేశ్వర్లు (47) ఒంగోలు నుంచి పేర్నమిట్ట తన లారీ కోసం వెళుతున్నాడు. మార్గమధ్యలో ఒక పాఠశాలకు చెందిన మినీ వ్యాన్ రాంగ్‌రూట్‌లో ఎదురుగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లు రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయం అయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఒంగోలు తాలుకా పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేతుల శుభ్రత ప్రకటనలకే పరిమితమా?

- పాఠశాలల్లో కనిపించని 'హ్యాండ్ వాష్'
- అవగాహన కల్పించకపోవడంతో అనారోగ్యమే!

ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచేందుకు ప్రకటించిన పాఠశాలల్లో హ్యాండ్ వాష్ ప్రకటనలకే పరిమితమైంది. నగరంలోని కార్పొరేషన్ పాఠశాలల్లో నీటి కొరత ఏర్పడటంతో చేతులు శుభ్రం చేసుకునే అంశం కార్యరూపం దాల్చడం లేదు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు అవగాహన కల్పిస్తున్నామని చెబుతున్నప్పటికీ అందుబాటులో సరిపడా నీరు లేకపోవడంతో మురికి చేతులతోనే ముద్ద తినాల్సిన దుస్థితి కనిపిస్తోంది. దీంతో ఏడాదికి ఒకసారి మాత్రమే మొక్కుబడిగా హ్యాండ్ వాష్‌పై బక్కెట్ నీటితో అవగాహన కల్పించి ముగించేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు వరల్డ్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం..



ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత తెలుగుదేశం పాలనలో పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు, అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రతి ఏడాదీ ఎస్ఎస్ఏ గ్రాంట్ కింద రూ.5వేలు నుంచి రూ.7వేల వరకు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో సబ్బులు, టవల్స్ అవసరమైన సామగ్రి కొనుగోలు చేయాలి. విద్యార్థులకు అందుబాటులో ఉంచడంతోపాటు, భోజనం చేసే ముందు విద్యార్థులు చేతులు కడుక్కుంటున్నారా? లేదా? అని పర్యవేక్షించాలి. కానీ ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే మరిచింది. కనీసం నిధులు కేటాయించకపోగా, ప్రచారం తప్ప పరిశుభ్రతను పట్టించుకున్న వారు లేరు. దీంతో విద్యార్థులు ఉదయం నుంచి పుస్తకాల చేతపట్టి, నోట్సులు రాసి, ఇంకులయిన చేతులతో, డ్రిల్ క్లాసులో చేతికంటిన మంటితోనే అలాగే భోజనానికి కూర్చోవడం కనిపిస్తోంది.

టవల్స్, సబ్బులు లేవు

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల పరిశుభ్రతకు ప్రత్యేక నిధులు కేటాయించారు. తప్పనిసరిగా టవల్స్, సబ్బులు అందుబాటులో ఉంచాలి. మధ్యాహ్నం భోజన సమయంలో తప్పనిసరిగా చేతులను సబ్బుతో కడుక్కొన్న తర్వాతే భోజనం చేయాలి. అందుకు ఆ పాఠశాలల ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలి. కానీ అలాంటివీ ప్రభుత్వ పాఠశాలల్లో కనిచూపుమేరలో కూడా కనిపించడం లేదు. కేవలం తాగేందుకు మాత్రమే అరకొర నీటిని బబుల్స్ ద్వారా తెప్పిస్తుండగా, కొన్ని పాఠశాలల్లో అసలు తాగునీరు లేక విద్యార్థులు దాహంతో అల్లాడిపోతున్నారు. ఫలితంగా విద్యార్థులకు శ్వాసకోస, టైఫాయిడ్, కలరా, జ్వరం, కామెర్లు, విరేచనాలు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు వెల్లడిస్తున్నారు.

చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలంటే..

ముందుగా అరచేతిని సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తరువాత చేతుల వెనుక భాగం శుభ్రం చేయాలి. అనంతరం వేళ్ల వెనుక మణికట్టు భాగంలో కడగాలి. తర్వాత దశలో చేతి వేళ్ల మధ్య కడగాలి. చివరిగా చేతి వేళ్ల గోళ్లను శుభ్రం చేసుకున్న తర్వాతనే భోజనం చేయాలి. భోజనం చేసే ముందు, మల విసర్జనకు వెళ్లివచ్చిన తర్వాత, ఆటలు ఆడిన తర్వాత, దగ్గినపుడు, తుమ్మినపుడు చేతులు అడ్డుపెట్టుకోవడం ద్వారా క్రిములు చేతికి అంటుకునే ప్రమాదం ఉంది. అందువల్ల శుభ్రత చాలా ముఖ్యం.

గ్రామాల అభివృద్ధి బాధ్యత కార్యదర్శులదే

- ప్రజారోగ్యం, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి
- కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమగ్రాభివృద్ధి, సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని కలెక్టర్ రాజాబాబు అన్నారు. ఈ విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం ఒంగోలు డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించడంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. పంచాయతీకి సంరక్షణ అధికారిగా (కస్టోడియన్) కార్యదర్శులపై తమ పరిధిలోని ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలన్నారు. రెవెన్యూకు సంబంధించిన అంశమని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగునీటి సమస్య కేవలం ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి మాత్రమే చెందినదిగా అనుకోవద్దని, స్థానిక పరిస్థితులపై పంచాయతీ కార్యదర్శుల సమగ్ర పరిశీలన అవసరమని అన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

- 16న పీఎం శ్రీశైలం రూట్లు మార్పు
- దోర్నాల - శ్రీశైలం, గుంటూరు - కర్నూలు వెళ్లే వాహనాల మళ్లింపు
- మార్కాపురం డీఎస్పీ నాగరాజు

పెద్ద దోర్నాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం పుణ్యక్షేత్ర సందర్శనకు ఈనెల 16వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వస్తుండటంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ ప్రధాని పర్యటన నేపథ్యంలో 16వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే వాహనాలను దోర్నాల వద్దే నిలిపివేయనున్నామని, ఈ విషయాన్ని యాత్రికులు గమనించాలని ఆయన కోరారు. గుంటూరువైపు నుంచి కర్నూలు వెళ్లే వాహనాలను పెద్దారవీడు కుంట జంక్షన్ వద్ద దారి మళ్లించి గిద్దలూరు, నంద్యాల మీదుగా వెళ్లేలా రూట్ మార్చినట్లు చెప్పారు. కర్నూలు వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే యాత్రికులు కూడా వీలైనంత వరకు ఆరోజు ప్రయాణం వాయిదా వేసుకోవడం ఉత్తమమన్నారు. అప్పటికే ప్రయాణం చేసి దోర్నాల వచ్చిన వారు మాత్రం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి ఉండాల్సిందేనని, ఇందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ రావు, ఎస్సై మహేశ్ పాల్గొన్నారు.

మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి

రైతు ఆత్మహత్య

ముండ్లమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూజెండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు పెంగళశెట్టి వెంకటేశ్వర్లు (50) మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. వెంకటేశ్వర్లుకు రెండెకరాలు పొలముంది. సేద్యంలో నష్టాలు రావడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఏ పనిచేసినా కలిసి రావడం లేదనే ఆత్మన్యూనతతో దిగులు పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈనెల 8వ తేదీ మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00



బంధువులను ఓదార్చుతున్న కలెక్టర్‌వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్

శ్రమించారు.. గుర్తించారు..

మూడో రోజు తీరానికి ఐదో మృతదేహం

చీరాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం వాడరేవు తీరంలో గల్లంతైన ఐదుగురు మృతదేహాలను ఎట్టకేలకు అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు బీటెక్ విద్యార్థుల మృతదేహాలు ఆదివారమే తీరానికి చేరు కున్నాయి. కాగా గల్లంతైన చీరాల ప్రాంతానికి చెం దిన పదో తరగతి విద్యార్థి కోట గౌతమ్ కృష్ణ ప్రసాద్(16), బీటెక్ విద్యార్థి కూచిన షారోన్ రాజ్(18) కోసం కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 10 బోట్లు, 10 మంది వీఆర్వోలు, ఆరు డ్రోన్ కెమెరాలు, 10 మంది గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. వారి జాడ తెలిస్తే తెలియజేయాలని మత్స్యకార గ్రామాల్లో చాటింపు కూడా చేయించారు. ఈ క్రమంలో సోమవారం గౌతమ్ మృతదేహం ఒడ్డుకు చేరగా, షారోన్ ఆచూకీ తెలియలేదు. బిడ్డ కడచూపు కోసం తల్లిదండ్రులు, బంధువులు మూడు రోజులుగా తీరంలో విలపించసాగారు. 24 గంటల్లో అతడిజాడ గుర్తిస్తామని కలెక్టర్, ఎస్పీ హామీ ఇచ్చారు. దీంతో గాలింపు ముమ్మరం చేయడంతో మంగళవారం మధ్యాహ్నం నాగులుప్పలపాడు సమీపంలో ఏటికుప్పాక వద్ద షారోన్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అక్క పెళ్లికని వచ్చి..

వేటపాలెం మండలం కొత్తపేటకు చెందిన కూచిన షారోన్ తల్లిదండ్రులు వసంతరాజు, సునంద వ్యవసాయ కూలీలు. గత గురువారం షారోన్ అక్కకు వివాహం జరిగింది. ఇందుకోసం రాజమండ్రిలో బీటెక్ చదువుతున్న షారోన్ చీరాలకు వచ్చాడు. వివాహం అనంతరం కృష్ణప్రసాద్‌తో సముద్రానికి వచ్చి మృత్యువాత పడ్డాడు. కృష్ణప్రసాద్ తల్లిదండ్రులైన కోట ప్రసాద్, మాధవీ కూడా కూలీలే.

రిసార్ట్స్ నిర్వాహకులపై విమర్శలు

ఇటీవల వరుసగా మరణాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో రిసార్ట్స్ నిర్వాహకులపై ప్రజలు మండి పడుతున్నారు. ఇష్టారీతిగా రిసార్ట్స్ నిర్మించుకుని వ్యాపారాలు సాగిస్తున్న నిర్వాహకులు ప్రజల ప్రాణాలకు ఎందుకు బాధ్యత వహించరని ఆగ్రహిస్తున్నారు. ప్రమాదాల నియంత్రణకు గతంలో గజ ఈతగాళ్లను నియమించి ఆ బాధ్యతను రిసార్ట్స్ యజమానులకు గతంలో ఎమ్మెల్యే కొండయ్య అప్పగించారు. అయితే నిర్వాహకులు ఎమ్మెల్యే చెప్పినట్లు చేయడంలేదు. అందువల్లే తరచూ మరణాలు సంభవిస్తున్నాయని పర్యాటకులు ఆరోపిస్తున్నారు.

ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు - కలెక్టర్

ఇకపై తీరంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గాలింపులో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. పర్యాటకులు ప్రమాదాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు.

ఔషధాలకు.. అమలేది!



ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న ఔషధాల అమ్మకాలపై పర్యవేక్షణ కొరవడింది. చాలా రకాల మందులకు తగ్గిన జీఎస్‌టీ అమలు కావడం లేదు. ఇంకా పాత ఎంఆర్‌పీ ప్రకారమే మందులు విక్రయిస్తున్నారు. సూపర్ జీఎస్‌టీ- సూపర్ సేవింగ్స్ అంటూ అధికార యంత్రాంగం ప్రచారానికే పరిమితమైంది తప్పిస్తే క్షేత్ర స్థాయిలో అమ లు చేయించడంలో విఫలమవుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రచార ఆర్భా టానికి ఇచ్చిన ప్రాధాన్యత కొత్త జీఎస్‌టీ ఫలాలను ప్రజలకు అందించే దిశగా చర్యలు తీసు కోలేకపోతున్నారు. జీఎస్‌టీ అమలు పై పర్యవేక్షణ పూర్తిగా కొరవడంతో వ్యాపా రులు ఇష్టారాజ్యంగా పాత ఎంఆర్‌పీలకే విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితి పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో కనిపిస్తోంది.

- ఇంకా పాత జీఎస్‌టీతోనే మందుల విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- అడిగితేనే కొత్త జీఎస్‌టీ అమలు
- సూపర్ జీఎస్‌టీ.. సూపర్ సేవింగ్స్ ప్రచారానికే పరిమితం
- క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తగ్గిన జీఎస్‌టీ ఫలాలు రోగులకు ఇంకా అందని ద్రాక్ష చందాన మారింది. కొన్ని రకాల మందులకు జీఎస్‌టీ పూర్తిగా రద్దయినా అది అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పుడు ప్రతి కుటుంబానికి మందులు ఓ నిత్యావసర వస్తువులా మారాయి. ప్రతి ఇంట్లో వృద్ధులు ఉన్నారు, అలాగే 50 ఏళ్ల పైబడిన వారిలో 50 శాతం మంది అలాగే షుగర్.. బీపీ.. గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు నిత్యం ఔషధాలను వినియోగిస్తారు. జీఎస్‌టీ తగ్గింపుతో ఔషధాల ధరలు తగ్గాయని వినియోగదారులు ఆనంద పడుతుంటే కొందరు దుకాణదారులు వాటిపై పాత జీఎస్‌టీనే అమలు చేస్తూ అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఇదేంటని అడిగిన వారికే తగ్గిన జీఎస్‌టీని అమలు చేస్తున్నారు. కొన్ని కార్పోరేట్ షాపులు కూడా ఇదే పంథాను అవ లంబిస్తున్నాయి. అధికారులు జీఎస్‌టీ తగ్గిం దని షాపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించి చేతులు దులుపుకుంటున్నారు తప్పిస్తే పూర్తి స్థాయిలో అమలుకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. కొన్ని రకాల మందులకు 12, 18 శాతం జీఎస్‌టీ ఉండేది. ఆయా మందులకు 5 శాతం వరకు ప్రభుత్వం తగ్గించింది. కొన్ని రకాల మందులకు 6.25 శాతం, ఇంకొన్నిటికి 11.02 శాతం ఉంది. గతంలో కొన్ని రకాల మందులకు 12 శాతం, 5 శాతం జీఎస్‌టీ ఉంది. ఈ విభాగాల్లో జీఎస్‌టీని జీరోగా ప్రభుత్వం ప్రకటించింది. ఆయా రకాల మందులకు 10.72 ØĿ , 4.77 ØĿ 1Gs ĿWQ

ప్రచారానికే పరిమితం

జీఎస్‌టీ తగ్గింపు ప్రచారం ఓ పండుగలా ప్రభుత్వాలు నిర్వహిస్తున్నా వాటి ఫలాలు ఇంకా వినియోగదారులకు అందుబాటులోకి రాలేదు. ఒక్కొక్క కుటుంబానికి అంత.. ఇంత ఆదా అయిందని అధికారులు ప్రచారం చేస్తున్నారే తప్ప ఆచరణలో కానరావడం లేదు. పాత జీఎస్‌టీ కింద కొనుగోలు చేసిన మందుల నిల్వలు పూర్తిగా విక్రయించి కొత్త జీఎస్‌టీ అమలులోకి వచ్చిన తర్వాత మందులు కొనుగులు చేసే వరకు వ్యాపారులు పాత ఎంఆర్‌పీ ప్రకారమే విక్రయించనున్నారు. అయితే కొత్త జీఎస్టీ ప్రకారం మందుల విక్రయాలు జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, మందుల ధరలు తగ్గించాలని రోగులు కోరుతున్నారు.



- పర్చూరు వద్ద రూపుదిద్దుకున్న వాడరేవు - పిడుగురాళ్ల హైవే

హైవే.. రయ్‌రయ్

- శరవేగంగా 167ఏ నిర్మాణ పనులు
- వచ్చే నెల చివర్లో ప్రారంభానికి సన్నాహాలు
- ఆంధ్ర, తెలంగాణ ప్రయాణం సులభతరం

పర్చూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల ఎన్‌హెచ్- 167ఏ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ హైవేతో పల్లెలు, గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. ఎన్‌హెచ్ - 167ఏ కోస్తా ప్రాంతానికి ముఖ్యంగా చీరాల, పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట తదితర పట్టణాలను అనుసంధానం చేస్తోంది. రూ.1064 కోట్లతో 85 కిలోమీటర్ల పొడవున దీనిని నిర్మిస్తున్నారు. ముఖ్యమైన బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు చాలావరకు పూర్తిచేసుకున్నాయి. వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు, తద్వారా నకరికల్లు వరకు రెండు ప్యాకేజీలుగా విభజించి పనులు చేస్తున్నారు. వాడరేవు నుంచి చీరాల మండ లం ఈపూరుపాలెం వరకు 18 కిలో మీటర్ల మేర కొత్త రహదారిని నిర్మిస్తున్నారు. దీంతో చీరాల ప్రాంతానికి మరింతగా రవాణా సౌకర్యం మెరుగుపడనున్నది. ఈ రహదారితో రవాణా సౌకర్యం మెరుగుపడనున్నది. దీంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇదొక పెద్ద మైలురాయిగా మారే అవకాశాలున్నాయి. రవాణా సదుపాయంతోపాటు, ట్రాఫిక్ సమస్య కూడా తగ్గనున్నది. నవంబరు చివరి కల్లా పనులు పూర్తిచేసుకుని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి జాతీయ రోడ్ల సమీక్షలో అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు కూడా చేశారు.

భూముల ధరలకు రెక్కలు...

నిన్నా మొన్నటి ఎకరం భూమి రూ.30 నుంచి 40 లక్షలకే పరిమితమైన భూములు నేడు రూ.కోటికి పైగా పలుకుతున్నాయి. హైవే పక్కన ఉన్న భూములకు గిరాకీ పెరిగింది. ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఇక్కడికి వచ్చి పలువురు భూములను కొనుగోలు చేస్తున్నారు.



ఉప్పుటూరు మీదగా నిర్మించిన రోడ్డు

కదిలే రైళ్లపై రాళ్లు విసిరిన నిందితుల అరెస్ట్

- మూడురోజుల క్రితంచీరాల ఆర్వోబీ వంతెన సమీపంలో ఘటన
- నేరస్థులు ముగ్గురు చీరాలకు చెందిన వారే



వివరాలను వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

చీరాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కదిలే రైళ్లపై రాళ్లు విసిరిన చీరాలకు చెందిన ముగ్గురు నిందితులను చీరాల ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం వివరాలను ఆర్‌పీఎఫ్ సీఐ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. చీరాలకు చెందిన రాఘూరి మణికంఠ, జగతా సాయివంశీ, మానుపాటి శ్రీను గత ఆదివారం రాత్రి గూడ్సు రైలు (టీఎల్ఎస్), విక్రమ సింహపురి(12744)రైళ్లపై రాళ్లు విసిరారు. ఆ సమయంలో ప్రయాణికులకు తృటిలో ప్రమాదం తప్పింది. దీంతో ముగ్గురిపై రైల్వే చట్టం 153 కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జీఆర్పీ ఎస్సై కొండయ్య, ఆర్‌పీఎఫ్ ఎస్సై మనోజ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ గోడ కూల్చివేత

- అడుగు ముందుకేసిన అధికారులు
- తీరంలో అక్రమ కట్టడం తొలగింపు
- కొద్ది రోజులుగా రిసార్ట్ నిర్వాహకులు, అధికారుల మధ్య వివాదం



గోడను కూల్చివేయించిన తహసీల్దార్ గీతారాణి, అధికారులు

రామాపురం(చీరాల), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రామాపురం తీరంలో కొంతకాలంగా ఓ రిసార్ట్ నిర్వాహకునికి, అధికారులకు మధ్య జరుగుతున్న కోల్డ్‌వార్‌లో మంగళవారం అధికారులు ఒక అడుగు ముందుకేశారు. సీఆర్‌జడ్(కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్) నిబంధనలు అతిక్రమించి నిర్మించిన గోడను కూల్చివేశారు.

రామాపురం తీరంలోని ఆర్య గ్రాండ్ రిసార్ట్ నిర్మాణంపై కొంతకాలంగా నిర్వాహకులకు, అధికారులకు మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. ఈ నిర్మాణం అక్రమమంటూ గతంలో ఉన్న కలెక్టర్ వెంకట మురళీ ఆధ్వర్యంలో నోటీసులు కూడా అందించారు. అయితే తనకు అనుమతులున్నాయని, నిర్వాహకులు కోర్టును ఆశ్రయించడంతో ఎటూ తేల్చలేక అధికారులు మల్ల గుల్లాలు పడ్డారు. వదిలేద్దామా..? న్యాయపోరాటం చేద్దామా..? అని అధికారులు ఒక దశలో మల్లగుల్లాలు పడ్డారు.

ఇదీ నేపథ్యం..

ప్రస్తుతం నడుస్తున్న రిసార్ట్‌ను గొర్రెల పెంపకం షెడ్డుగా ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రారంభసమయంలో అందుకు సంబంధించిన ఆధారాలు కూడా సేకరించారు. అయితే కొద్దిరోజులు అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. కొంతకాలం తర్వాత అటువైపు చూసి నివ్వెరపోయారు. ఏకంగా ఆధునిక హంగులతో రిసార్ట్‌గా రూపుదిద్దుకుంది. దీంతో అప్పటి నుంచి అధికారులు నోటీసులు ఇవ్వడం, తిరిగి రిసోర్టు యజమాని న్యాయస్థానాన్ని ఆశ్రయించడం పరిపాటిగా మారింది. అధికారులు ఒక దశలో విసిగి వేసారిన అధికారులు 46 శాతం అపరాధ రుసుము చెల్లించుకుని కథను ముగించాలని కూడా సదిగ్ధంలో పడ్డారు.

మలుపు తిరిగిందిక్కడ..!

అయితే రిసార్ట్ నిర్వాహకులు మరో స్థలంలో కూడా కట్టడం నిర్మించేందుకు గోడను నిర్మించారు. అది సీలింగ్ ల్యాండ్ సర్వే నెంబర్ 427/3- 3బి/2సీలో ఉందని అనధికారమని అధికారులు మళ్లీ నోటీసులు ఇచ్చారు. అయినా సెలవు రోజుల్లో అధికారులు కళ్లుగప్పి నిర్మాణం పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకున్నాడు. వెంటనే గోడ తొలగించాలని నోటీసులు స్పందన లేకపోవడంతో మంగళవారం ఏకంగా వేటపాలెం తహసీల్దార్ గీతారాణి ఆధ్వర్యంలో వీఆర్వోలు, పోలీసుల సమక్షంలో గోడను కూల్చారు. దీంతో ఒకింత అక్రమ నిర్వహణ దారుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమైంది.

నేటి నుంచి ఖోఖో జట్టుకు శిక్షణ

పంగులూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దక్షిణ మండల జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టుకు 15న బుధవారం నుంచి పంగులూరులో శిక్షణ ఇవ్వనున్నట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. 31వ దక్షిణమండలి జాతీయస్థాయి పురుషుల ఖోఖో పోటీలు కర్నాటక రాష్ట్రంలోని ధావణగిరి పట్టణంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరుగుతాయని సీతారామిరెడ్డి తెలిపారు. ఈ పురుషుల జట్టుకు పంగులూరు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో ఈ నెల 22 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోచ్‌గా సీనియర్ ఖోఖో క్రీడాకారుడు షేక్ ఆలీనవాజ్ వ్యవహరిస్తారన్నారు. గ్రామస్థులు, దాతల సహకారంతో భోజనవసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

మార్టూరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగరాజు పల్లి గ్రామంలో మంగళవారం కాటూరి మెడికల్ కళాశాల, వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ వ్యాధులకు సంబంధించి 185 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారిలో అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. టీడీపీ గ్రామ నాయకులు మిన్నెకంటి రవికుమార్ వైద్యశిబిరానికి సహాయసహకారాలు అందించారు. కార్యక్రమంలో వైద్యశాలకు చెందిన పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరణ

అద్దంకి,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పీపీపీ పేరుతో మెడికల్ కళాశాలలను నాయకులు కట్టబెట్టాలని చూస్తున్నారని వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ ను నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టిన క్రమంలో మంగళవారం అద్దంకిలో డాక్టర్ అశోక్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో పలు గ్రామాల వైసీపీ నేతలు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల మెరుగునకు జీఎస్టీ దోహదం

● ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్

పర్చూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గింపునకు శ్రీకారం చుట్టడం జరిగిందని ఎంపీడీవో వీ.ప్రద్యుమ్నకుమార్ అన్నారు. దీనివల్ల ప్రభుత్వాలకు కొంత ఆర్థిక భారం అయినప్పటికీ ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచి ఆర్థిక పురోగతిని సాధించాలన్న సంకల్పంతో జీఎస్టీ స్లాబ్‌లో మార్పులు చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో అధ్వర్యంలో ఆయా శాఖల అధికారులతో కలిసి తగ్గిన జీఎస్టీ వివరాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కొసనా సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి మస్తాన్‌రావు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ సౌకర్యం

స్విచ్ఛాన్ చేసిన ఈఈ మస్తాన్‌రావు


మోటారు స్విచ్ ఆన్ చేస్తున్న ఈఈ మస్తానరావు

పంగులూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో 26 వ్యవసాయ పంపుసెట్లకు 6 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు విద్యుత్‌శాఖ ఈఈ మస్తానరావు తెలిపారు. రైతులు తమ పంటపొలాలలో సాగునీటి కోసం ఏర్పాటు చేసుకున్న వ్యవసాయబోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆశ్రయించారు. ఈ విషయమై వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీంతో స్పందించిన ఆయన మూడునెలల్లో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. నూతనంగా ఏర్పాటుచేసుకున్న విద్యుత్‌మోటార్లకు మంగళవారం ఆయన విద్యుత్‌సరఫరా ప్రారంభించారు. 26 వ్యవసాయ బోర్లకు ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్‌సౌకర్యం కల్పించేందుకు రూ.37,50,733ల వ్యయ అంచనా కాగా రైతులు తమ వాటాగా రూ.2.35 లక్షలు చెల్లించారన్నారు. ప్రభుత్వం రూ.36,76,482లు రాయితీ ఇచ్చినట్లు ఈఈ తెలిపారు. ఇంచుమించు వందెకరాలకు సాగునీరు అందేలా వ్యవసాయబోర్లకు విద్యుత్‌సౌకర్యం కల్పించిన మంత్రి గొట్టిపాటికి, విద్యుత్‌శాఖ అధికారులకు స్థానిక నేతలు ఎనికపాటి శ్రీనివాసరావు, పూనాటి రామాంజనేయులు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లపూడిఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ దామోదరం, ఏఈఈ అంజనేయులు, అంజయ్య, శ్రీనివాసరావు, సింగర్, రైతులు పాల్గొన్నారు.

నేడు మెగా కంటి వైద్య శిబిరం

అద్దంకిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అద్దంకి బంగ్లారోడ్డులోని ప్రేమ ఐ కేర్ అండ్ ఆప్టికల్స్ 3వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటల నుండి వైద్యశాలలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జీ. షాలేంరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో రోగులకు ఉచిత కంటి పరీక్షలు, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. కంటి సమస్యలున్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన పేదలకు ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక డిస్కౌంట్ ధరలలో కళ్ళజోళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అద్దంకి, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెండు రోజులు అరకొర బస్సులే

● కర్నూలుకు వెళ్తున్న 25 సర్వీసులు

అద్దంకి, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి):కర్నూలు జిల్లాలో పీఎం మోదీ పర్యటన నేపథ్యంలో అద్దంకి డిపో నుంచి 25 బస్సులను పంపుతున్నారు. అద్దంకి డిపోలో మొత్తం 69 బస్సులుండగా, వాటిలో 25 అద్దె బస్సులు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో గురువారం పీఎం నరేంద్ర మోడీ పర్యటన ఉన్న నేపథ్యంలో 25 ఆర్టీసీ బస్‌లను బుధవారం ఉదయం పంపుతున్నారు. గురువారం బహిరంగ సభ ముగిసిన అనంతరం తీసుకువెళ్లిన ప్రజలను మరలా గ్రామాలలో దించి శుక్రవారం ఉదయంకు బస్సులు అద్దంకి చేరుకునే అవకాశం ఉంది. దీంతో బుధ, గురువారంలలో పలు రూట్లలో బస్ సర్వీసులు రద్దు కానున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉంది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బల్లికురవ, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేని వారిపాలెం గ్రామంలో సోమవారం పురుగుమందు తాగి అత్మహత్యకు యత్నించిన యువకుడు నాయుడు లక్ష్మీనారాయణ(29) వైద్యశాలలో చి కిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ వై.నాగరాజు మంగళవారం తెలిపారు. ఓ మహిళను వేధింపులకు గురిచేసిన ఘటనలో లక్ష్మీనారాయణపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. దీంతో మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించాడు. మృతుడి భావ దర్శి కాంతారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఏబీసీలో మహిళ మృతదేహం లభ్యం

బల్లికురవ,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని మహిళ మృతదేహం కొట్టుకు వచ్చింది. వైదన సమీపంలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసుకు సమాచారం అందించారు. ఎస్సై నాగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 45 ఏళ్ల వయస్సు ఉన్న మహిళ మృతదేహంగా గుర్తించారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం పిట్టంబండ కు చెందిన మహిళగా భావిస్తున్నారు. మృతదేహం బయటకు తీసేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

అద్దంకి,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి కారు నడిపిన వ్యక్తికి అద్దంకి కోర్టులో మంగళవారం న్యాయాధికారి అఖిల రూ.10 వేల జరిమానా విధించారు. పట్టణంలోని భవానిసెంటర్ లో మద్యం సేవించి కారు నడుపుతుండగా సీఐ సుబ్బరాజు అదుపులోకి తీసుకొని మంగళవారం కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి అపరాధ రుసుము విధించారు.

కాల్ బాయ్ వ్యాపారం ముసుగులో సైబర్ నేరాలు

- అమ్మాయి ఫొటోతో ఫేస్‌బుక్ ఖాతా
- రైస్ మిల్ నిర్వాహకుడిని బెదిరించి రూ.కోటి స్వాహా
- సంపాదించినదంతా క్రికెట్ బెట్టింగ్‌లో సమర్పణ

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాల్ బాయ్ వ్యాపారం ముసుగులో సైబర్ నేరాలకు పాల్పడుతోన్న బాపట్ల జిల్లా ఇంకొల్లుకు చెందిన చోడ చైతన్య కృష్ణ పవన్ (27) అనే నిందితుడిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నిందితుడిని మీడియా ఎదుట హాజరు పరచి వివరాలు వెల్లడించారు. గుంటూరులోని ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన ఓ రైస్‌మిల్ నిర్వాహకుడికి ఆరు నెలల కిందట ఫేస్‌బుక్ మెసెంజర్‌లో శైలజ మార్ని పేరుతో నిందితుడు హాయ్ అని మెసేజ్ పెట్టాడు. కాల్ బాయ్‌గా వెళ్తే డబ్బులు వస్తాయని నిందితుడు చెప్పగా అందుకు బాధితుడు తన వయసు 68 సంవత్సరాలని, తనకు ఇష్టం లేదని స్పందించాడు. చివరకు బాధితునితో మాటలు కలిపి అతని పూర్తి వివరాలు తెలుసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత వేరే నంబర్‌తో ఫోన్లు చేసి తాము పోలీసులమనీ, నువ్వు మహిళలతో అసభ్యంగా చాట్ చేస్తున్నట్లు నీ మీద కేసు నమోదైందని చెప్పాడు. కేసు నుంచి తప్పించడానికి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని బెదిరించాడు. అలాగే మరో నంబర్‌తో బాదితుడుకి ఫోన్ చేసి తాము ఆదాయపన్నుశాఖ అధికారులమని, రైస్ మిల్లుపై రైడ్ చేయడానికి వస్తున్నామని చెప్పాడు. రైడ్ చేయకుండా ఉండాలంటే డబ్బులివ్వాలని బెదిరించాడు. ఇలా బెదిరించి పలు దఫాలుగా బాధితుడిని భయపెట్టి రూ.కోటి వరకు కాజేశాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతడి వద్ద నుంచి ఐ ఫోన్‌తో సహా రెండు సెల్‌ఫోన్లు, నాలుగు సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. కాగా బాధితుడు కొట్టేసిన నగదును ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టాడని చెప్పారు. బిహార్, యూపీ తదితర రాష్ట్రాల్లో అమాయకుల పేరుతో తప్పుడు ఖాతాలు సృష్టించి క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, వాటిపై కూడా దృష్టి సారించి సొత్తు రికవరీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలు, స్నేహ అభ్యర్థనలు మొదలైన వాటికి స్పందించవద్దని ఎస్పీ సూచించారు. ఏదైనా అనుమానంగా ఉన్నా, ఎవరైనా బెదిరింపులకు పాల్పడుతున్నా వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో గానీ, డయల్ 112 లేదా 1930 నంబర్లకు గానీ సంప్రదించాలని ఎస్పీ సూచిం చారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పట్టాభిపురం సీఐ గంగా.వెంకటేశ్వర్లు, ఎస్సై రాజ్ కుమార్, ట్రైనీ ఎస్సై ప్రదీప్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావును, ఐటీ కోర్ సీఐ నిస్సార్ భాషా, హెడ్ కానిస్టేబుల్ రాజా కిషోర్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించి వారికి ప్రశంసాపత్రాలు అందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఉపాధి అక్రమాలు వెలుగు చూసేనా..?

- కప్పిపుచ్చేందుకు పెద్దస్థాయిలో అక్రమార్కుల పైరవీలు
- గ్రామాల్లో కొనసాగుతున్న ఆడిట్

అద్దంకి, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉపాధి అక్రమాలకు అంతేలేకుండా పోయింది. ఉపాధి పనులు నిర్వహణపై సోషల్ ఆడిట్ నిర్వహించినా, పలు మండలాలలో మొక్కుబడిగా మాత్రమే నిర్వహించారు.

సంతమాగులూరు మండలంలో సోమ వారం నుండి ఉపాధిహామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులను సోషల్ ఆడిట్ బృందం తనిఖీలు ప్రారంభించింది. ఈ క్రమంలో సోమ, మంగళవారాల్లో కామేపల్లి, మిన్నెకల్లు, పత్తేపురం, పరిటాల వారిపాలెం, కుందుర్రు, మామిల్లపల్లి, పుట్టావారిపాలెంలలో పరిశీలన చేశారు. నెల రోజుల క్రితం జరగాల్సిన ఈ పరిశీలన, సోషల్ ఆడిట్‌ను ఒత్తిడి చేయించి వాయిదా వేయించుకుంటూ వచ్చినట్లు తెలుస్తోంది. అయితే బల్లికురవ మండలంలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చిన తనిఖీ బృందం కాకుండా బాపట్ల జిల్లాకే చెందిన ఓ అధికారి పర్యవేక్షణలోని బృందం నేతృత్వంలో తనిఖీలు చేయించటం పలు అనుమానా లకు తావిస్తుంది. సంతమాగులూరు మండలంలోని అడవిపాలెం, పాత మాగులూరు, సంతమాగులూరు, వెల్లల చెరువు, కుందుర్రు, సజ్జాపురం, పుట్టావారి పాలెం, చవిటిపాలెం తదితర గ్రామాలలోని ఉపాధి పనులలో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు, కలెక్టర్‌కు, ఆయా గ్రామాల ప్రజలు పిర్యాదు చేశారు. అయితే గ్రామాలలో జరిగే సోషల్ ఆడిట్‌లో ఎలాంటి అ క్రమాలు వెలుగు చూడకుండా ఉండే విధంగా సిబ్బంది అన్ని ముందస్తు జా గ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే లైవ్ సోషల్ ఆడిట్ కావడంతో తనిఖీ చేసే ఆడిట్ బృందం కూడా అక్రమాలు కప్పి పుచ్చేందుకు సంసిద్ధంగా ఉంటారా..?, లేదా..? అన్న విషయం తెలియాల్సి ఉంది. జిల్లాలోని పలు మండలాలలో ఉపాధిహామీ పథకం సోషల్ ఆ డి ట్ మొక్కుబడిగా జ ర గ గా బల్లి కు ర వ మండ లంలో మాత్రం లైవ్ సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఉపాధి పనుల పరిశీలన చేసిన బృందం నిక్కచ్చిగా వ్యవహరించడంతో పెద్దఎత్తున అ క్రమాలు వెలుగు చూశాయి. జిల్లా ఉపాధిహామీ పథకం అధికా రులు అ క్రమాలను తక్కువ చూ పించేం దుకు తీ వ్ర స్థాయిలో ప్రయత్నం చేసి చివరకు సుమారు రూ.3 కోట్ల వరకు అక్రమాలు చోటు చేసుకున్నట్లు నిగ్గు తేల్చారు. అక్రమాలు నిగ్గు తేల్చినా చర్యలకు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. అయితే ఎట్టకేలకు త్వరలో కొంతమంది సిబ్బంది పై వేటు వేసేందుకు జిల్లా అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పూర్తి స్థాయి పర్యవేక్షణలో సంతమాగులూరు మండలంలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తే అక్రమాలు పెద్దఎత్తున వెలుగు చూసే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు అభి ప్రాయపడుతున్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న ఆడిట్ బృందం

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

- ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ సీమౌత్ దగ్గర సర్వే పూర్తి
- కలెక్టర్‌కు సమర్పించనున్న నివేదిక

బాపట్ల, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాలతో అధికార యంత్రాంగం అడవిపంచాయతీ పరిధిలో ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ సముద్రంలో కలిచే ప్రాంతానికి కదిలి వెళ్ళారు. జిల్లాలోని సముద్రతీరప్రాంతంలో 10గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఇటీవల ఉదయం నుంచి సాయంత్రం వరకు జీబీసీరోడ్డుపై బైటాయించి సమస్య పరిష్కరించాలంటూ ఆందోళన చేయటంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఇచ్చిన హామీ మేరకు సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో గత రెండురోజులుగా ఆర్డీవో పి.గ్లోరియా ఆధ్వర్యంలో ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ డ్రైన్ సముద్రంలో కలిసే ప్రాంతంలో మంగళవారం సర్వే చేశారు. తొలుత స్థానికులు సహకరించకపోయినప్పటికి కలెక్టర్ ఆదేశాల మేరకే తాము సర్వే చేస్తున్నామని చెప్పటంతో వారు సహకరించారు.దీంతో ఆప్రాంతంలో డ్రైనేజి విస్తీర్ణం, పట్టాభూమి, డీకెభూమిని పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు గుర్తించారు. మత్స్యకారులు, రైతుల సమక్షంలో సర్వే చేయటం జరిగింది. డ్రైనేజి పొంగి పోర్లి తన భూమి కోతకు గురైందని రైతు, పడవలు కాల్వలో నుంచి సముద్రంలోకి వెళ్ళే సమయంలో బుర్ల వెంకట్రావు అనే రైతు కాల్వలో వేసిన కొండరాళ్ళ వల్ల పడవలు దెబ్బతింటున్నాయని మత్స్యకారులు అధికారులకు వివరించారు. అయితే అక్కడ వాస్తవ పరిస్థితిని సర్వే ద్వారా గుర్తించారు. హద్దులు చూపించారు. దీనికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్.సలీమా, సీఐ శ్రీనివాసరావు, సర్వేయర్ లక్ష్మీనారాయణ, డ్రైనేజి డీఈ మురళి కృష్ణ, రైతులు, మత్స్యకారులు పాల్గొన్నారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో గ్లోరియా

క్రికెట్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో కొప్పరం విద్యార్థి సిద్ధార్థ సత్తా



చాంపియన్ ట్రోఫీతో సిద్ధార్థ

సంతమాగులూరు అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొప్పరం గ్రామానికి చెందిన మొగిలి వీర వెంకట శివనాగ సిద్ధార్థ సబ్ జూనియర్, సీనియర్స్ ఎలెవన్ క్రికెట్ నేషనల్ చాంపియన్ షిప్‌లో సత్తా చాటాడు. ఈ నెల 11, 12, 13వ తేదీలలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో కాసుల బ్రహ్మనందరెడ్డి కళాశాల మైదానంలో జరిగిన పోటీలలో అండర్-14, జూనియర్, ఏపీ ఏ టీమ్‌లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన ఇచ్చాడు. నరసరావు పేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో ఇండియా అండర్-14 తరపున ఆడే అవకాశం వస్తుందని సిద్ధార్థ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. కాగా సిద్ధార్థ నరసరావుపేట లోని సీబీఐటీ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా సిద్ధార్థ నుకోచ్ అఖిల్‌ను మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

పవన్, గోపీకృష్ణకు ఎమ్మెల్యే అభినందన

పర్చూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సేవింగ్ అంశంపై అత్యుత్తమ ప్రతిభ కనపర్చి ప్రధాన నరేంద్ర మోడీతో ముఖాముఖికి అరుదైన అవకాశం పొందిన మార్టూరు మండలం బొల్లాపల్లి విద్యార్థి చాతారాజుపల్లి పవన్ గోపీకృష్ణను ఎమ్మెల్యే ఏలూరి సాంశివరావు అభినందించారు. బొల్లాపల్లికి చెందిన పవన్ పంగులూరు మండలం కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతూ అద్భుత ప్రతిభ కనపరిచారని పేర్కొన్నారు. ఈనెల 16న గోపికృష్ణ శ్రీశైలంలో ప్రధాని నరేంద్ర మోడీని కలిసే అవకాశం రావడం ప్రతిభకు నిదర్శనం అన్నారు.

ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తా

- విద్యార్థులకు తప్పిన ప్రమాదం

చీరాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల - కారంచేడు రోడ్డులో ప్రైవేటు స్కూలు బస్సు బోల్తా పడింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకొంది. ప్రమాద సమయంలో బస్‌లో సుమారు 35 మంది చిన్నారులు ఉన్నట్లు సమాచారం. పిల్లల్లో కొంతమందికి మాత్రమే స్వల్ప గాయాలు అయినట్లు తెలిసింది. వీరిని ప్రత్యేక వాహనం ద్వారా నిర్వాహకుల ఇళ్లకు చేర్చారు. అయితే డ్రైవర్ వేగాన్ని అదుపు చేయలేక పోవడంతో ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు చెబుతున్నారు. ఎవ్వరికీ ఇబ్బంది లేకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

25 శాతం రాయితీతో శనగ విత్తనాలు

మార్టూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):రబీ సీజనుకు శనగ విత్తనాలను మండలంలోని రైతులకు 25 శాతం రాయితీతో ఇవ్వనున్నట్లు ఏవో కుమారి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎకరాకు 40 కిలోల వంతున గరిష్ఠంగా రైతుకు 5 ఎకరాలకు విత్తనాలను ఇవ్వన్నట్లు తెలిపారు. రైతులకు జేజీ-11 రకం, కేఏకే- 2 రకం విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన రైతులు గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

ప్రశ్నపత్రాల జారీలో ప్రత్యేక రూల్

- క్లస్టర్ పాఠశాలల ద్వారా జారీ చేయాలని నిబంధన
- ప్రశ్నించిన ఐదు పాఠశాలలకు మాత్రం ప్రత్యేక
- నిత్యం మండల కేంద్రానికి రావాల్సిందేనంటూ హుకుం

సంతమాగులూరు(అద్దంకి),అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ఎఫ్ఏ-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. అయితే సంతమాగులూరు మండలంలో మాత్రం నిబంధనలు సక్రమంగా అమలుకావడం లేదు. అయితే కొందరిపై మాత్రం లేని నిబంధనలు కూడా పాటించాలని హుక్కుం జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు ఉపాధ్యాయులు విద్యాశాఖ కమిషనర్‌కు తగు ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ఎఫ్ఏ 2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రాథమిక పాఠశాలలకు ఆయా సబ్జెక్టుల ప్రశ్నపత్రాలను క్లస్టర్ హైస్కూల్‌లో పరీక్షా సమయం కంటే ఒక గంట ముందు పత్రాలను ఇవ్వాల్సి ఉంది. ఇక ఉన్నత పాఠశాలలకు మాత్రం ఎంఈవో కార్యాలయంలో ఇవ్వాలి. అయితే సంతమాగులూరు మండలంలో మాత్రం కొన్ని పాఠశాలలకు ఒక నిబంధన, మరికొన్ని పాఠశాలలకు మరో నిబంధన అమలు చేస్తున్నారు. దీంతో మండల విద్యాశాఖ తీరు విమర్శలకు తావిచ్చింది. సంతమాగులూరు మండలంలో మొత్తం 56 ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఏల్చూరులో ఐదు ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఈ ఐదు పాఠశాలలకు మినహా మిగిలిన 51 పాఠశాలలకు సోమవారం ఉదయమే 4 సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు అందజేశారు. 'ముందే ఎలా ఇస్తారు' అని ఏల్చూరు లోని ఓ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రశ్నించడంతో 5 పాఠశాలలకు మాత్రం రోజుకు రెండుసార్లు చొప్పున నాలుగు సార్లు సంతమాగులూరు లోని ఎంఆర్‌సీ కార్యాలయానికి పిలిపించారు. అయితే ఏల్చూరు క్లస్టర్ హైస్కూల్‌లో పత్రాలు ఇవ్వాల్సి ఉండగా, ఇక్కడి సిబ్బందిని మాత్రం ఉద్దేశ్యపూర్వకంగా నాలుగుసార్లు సంతమాగులూరు ఎంఆర్‌సీకి పిలుపించుకుంటున్నారు. దీంతో ఏల్చూరులోని ఐదు పాఠశాలల ఉపాధ్యాయులు ఈ అంశంపై విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సోమవారం ఉదమే మిగిలిన అన్ని పాఠశాలలకు నిబంధనలకు విరుద్ధంగా ప్రశ్నాపత్రాలు మంజూరు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక ఎంఆర్‌సీలో ఉపాధ్యాయులపై పక్షపాత దోరణిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి కూడా పలువురు ఉపాధ్యాయులు తీసుకుపోయారు. ఉన్నతాధికారులు ఈ అంశం విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు

- ఉన్నత పాఠశాలలో వసతులను పరిశీలించిన డీఐఈవో
- గ్రామస్థులు, హెచ్‌ఎంతో సమావేశం

పంగులూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. జూనియర్ కళాశాలల డీఐఈవో జీకే జుబేర్ మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. కళాశాల నిర్వహణకు అవసరమైన వసతులు పరిశీలించారు. గత ఏడాది డిసెంబరు 7న పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు చందలూరు పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామంలో జూనియర్ కళశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై పరిశీలించి, జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని మంత్రి గొట్టిపాటి సంబంధిత అధికారులకు సూచించారు. దీంతో డీఐఈవో చందలూరు ఉన్నత పాఠశాలలో గ్రామపెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులుతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కళాశాల ఏర్పాటుకు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల రాకపోకలకు ఉన్న సౌకర్యాలు తదితర వివరాలను సమావేశంలో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జూనియర్ కళశాల ఏర్పాటు అవసరం, గదుల వసతి కల్పన గురించి సవివరంగా నివేదిక ఇవ్వాలని హెచ్‌ఎం. గిరిజకు సూచించారు. గ్రామస్థులు కమిటీగా ఏర్పడి కళాశాల ఏర్పాటు, నిర్వహణ లో తమతోడ్పాటును అందజేయాలన్నారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి కళాశాల ఏర్పాటు విషయమై అనుమతి కోసం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు డీఐఈవో తెలిపారు. జూనియర్ కళాశాల తమ గ్రామంలో ఏర్పాటు చేస్తే పది గ్రామాలకు ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ.సుబ్బారావు, హెచ్‌ఎం.గిరిజ, మంత్రి కార్యాలయ ప్రతినిధి బాలాజీ, అజిత్‌ట్రస్ట్ ఛైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, పెంట్యాల రామలింగస్వామి, విశ్రాంత హెచ్‌ఎం ఎస్.తాతయ్య, అంకమ్మ, అడ్డగడ సుబ్బయ్య, సతీష్, జగబాబు పాల్గొన్నారు.


పాఠశాలలో వసతులను పరిశీలిస్తున్న డీఐఈవో జుబేర్

విశాఖకు గూగుల్‌రాక టెక్ విప్లవానికి నాంది

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఒక కొత్త యుగం ఆరంభమైందని, విశాఖకు గూగుల్ రావటం ఏపీలో గేమ్ ఛేంజర్ కానుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఏలూరి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం ప్రారంభం కానుందన్నారు. ఇది కేవలం ఒక పెట్టుబడి కాదని, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌ను మార్చే చారిత్రాత్మక పరిణామం అన్నారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ వచ్చిన తరువాత అక్కడకి అనేక ఐటీ కంపెనీలు క్యూట్టాయని దీంతో హైదరాబాద్ స్వరూపమే మారిందన్నారు. రూ.15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ విశాఖలో సౌత్ ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ను నిర్మించబోతుందని తెలిపారు. డేటా సెంటర్ ఏర్పాటుతో 1.88 లక్షల మందికి ఉపాధి లభి స్తుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయం అన్నారు.

సీఎం కృషి ఫలితమే

ఉమ్మడి రాష్ట్రంలో హైదరా బాద్లో మైక్రోసాఫ్ట్‌ను తీసుకు వచ్చిన నగరాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడడు ఇప్పుడు అదే దిశగా విశాఖను ఏఐ, డిజిటల్ టెక్ సిటీగా తీర్చిదిద్దబోతున్నారన్నారు. సౌత్ ఆసియాలో అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ గూగుల్ విశాఖకు రావటం చంద్రబాబు నాయుడు కృషియే కారణం అన్నారు.

గూగుల్‌రాకతో రాష్ట్రానికి మేలు

చీరాల : విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌తో రాష్ట్రానికి ఏటా రూ.10 వేల కోట్లు ఆదాయం ఉంటుందని యువనాయకులు గౌరీ అమ ర్నాథ్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివ రావు పేర్కొన్నారు. మంగళవారం నియోకవర్గ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి ఆదాయ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తున్నట్లు చెప్పారు. వారి వెంట కూటమి నేతలు సజ్జా హేమలత, కౌత వరపు జనార్ధనరావు, గంజి పురుషోత్తం, సల్లూరి సత్యానందం,పద్మిని, నాగలక్ష్మీ పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న గౌరీఅమర్నాథ్



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఆడబిడ్డలను కాపాడుకోవటం

అందరి బాధ్యత

● అంతర్జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ శుక్లా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాల మనుగడ కోసం ఆడబిడ్డలను కాపాడుకోవటం మనందరి బాధ్యత అని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరులోని డీకే మహిళా కళాశాల నుంచి జీజీహెచ్ వరకు బాలికలతో స్కూటర్ ర్యాలీ జరిగింది. దీనిని కలెక్టర్ జెండా ఊపి ప్రారం భించారు. ఆడపిల్ల ఇంటికి వెలుగని, ఆమె అనుకుంటే ఏమైనా సాధించగలదని, కుటుంబం కోసం ఆమె చేసే త్యాగం మరెవ్వరూ చేయలేరంటూ మహిళల ఔన్నత్యా న్ని, ప్రతిభా పాఠవాలను కొనియాడారు. ప్రతీ ఇంట్లో ఆడబిడ్డ చదువుకుంటే ఆ కుటుంబంతోపాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రజలకు ఆడబిడ్డల గొప్పతనం తెలిసేలా జిల్లాలో వారం రోజులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, బాలల సంరక్షణ అధికారి సురేష్, ఆర్ఐవో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్కూటర్ ర్యాలీలో మహిళలు, బాలికలు

ఆడపిల్లల పుట్టుక అవసరం : డీఎంహెచ్‌వో

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల పుట్టుక ఈ సమాజానికి ఎంతో అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీ సుజాత పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆడపిల్లలను రక్షిద్దాం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలో ర్యాలీ జరిగింది. ఈకార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ఆడపిల్లని పుట్టనిద్దామని, ఎదగనిద్దామని వారిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. లింగ వివక్షను పూర్తిగా నివారిద్దామన్నారు. అన్ని రంగాల్లో బాలికలే ముందున్నారని దీన్ని ప్రతి తల్లిదండ్రులు గుర్తించి వారిని బాగా చదివించాలని కోరారు. రైతు బజారులోని పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేట మీదుగా ర్యాలీ సాగింది. ఈకార్యక్రమంలో డీఎల్ఏటీవో షేక్ ఖాదర్‌వలి, డీఐవో ఉమామహేశ్వరి, డీపీఎంవో రమేష్, డీఎం హుస్సేనమ్మ, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మిస్బా సుల్తానా, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటేష్, హెల్త్ సూపర్‌వైజర్ కరుణమ్మ, కమ్యూనిటి ఆర్గనైజర్ వేణు, ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికా దినోత్సవ అవగాహన ర్యాలీ

ఉదయగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. సీహెచ్‌వో శివకుమారి, హెచ్ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆడపిల్లలు చదుకున్నప్పుడే ఇల్లు, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నయ్య, భోగ్యం వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను

వెంటనే రిలీవ్ చేయాలి : ఏపీటీఎఫ్

నెల్లూరు(విద్య), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీల చట్టం ప్రకారం జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే ఆయా పాఠశాల లకు పంపించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వారు వినతిపత్రం ఇచ్చారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా జిల్లాలో 384 మంది ఉపాధ్యాయులు నూతన ప్రాంతాలకు బదిలీపై వెళ్లి చేరినా బలవంతంగా గతంలో విధులు నిర్వహించిన పాఠశాలలకే తిరిగి వచ్చేలా చేశారన్నారు. దీనిపై పలుమార్లు అధికారులతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులు వందమందికి పైగా పాఠశాలల్లో చేరినప్పటికీ కొంతమందిని మాత్రమే రిలీవ్ చేసి మిగిలిన వారిని అదే పాఠశాలల్లో కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అధికారుల అసంబద్ధ నిర్ణయాల కారణంగానే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని విమర్శించారు. అలాగే డీఎస్సీ ద్వారా కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు కూడా ఖాళీలను చూపకుండా వారికి అవసరమైన పాఠశాలలనే చూపించి నియామకాలు చేపట్టారన్నారు. విద్యాశాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న కార్యక్రమాలను నిరసిస్తూ ఈనెల 17వతేదీన జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట 48 గంటల నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎన్ దశరథరాములు, సీహెచ్ హజరత్ తదితరులు పాల్గొన్నారు.

19న క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉన్న క్రికెట్ ప్రాంగణంలో ఈ నెల 19వతేదీ అండర్-14 జిల్లా బాలుర జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఎస్ రాజశేఖరరెడ్డి, కే శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2011 సెప్టెంబరు 1 తర్వాత తరువాత జన్మించి ఉండాలన్నారు. అర్హత కలిగిన క్రీడాకారులు సొంత క్రికెట్ కిట్, వైట్ డ్రస్, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 7 గంటలకు హాజరు కావాలన్నారు.

సూపర్ జీఎస్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● జీఎస్టీ కావలి అసిస్టెంట్ కమిషనర్

కావలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంపొందించేందుకు నష్టాలను సైతం భరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ 2.0 కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని జీఎస్టీ కావలి అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్‌రావు తెలిపారు. ఐరన్ అండ్ హార్డ్‌వేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కావలి పట్టణంలో ఐరన్ అండ్ సిమెంట్ వ్యాపారులతో జీఎస్టీ అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ నూతన జీఎస్టీ తక్షణం అమలు పరచాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. తగ్గిన జీఎస్టీని అమలు చేయని వ్యాపారులపై వినియోగదారులు ఫిర్యాదు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కమిటీ సభ్యులు, కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ మెంబర్ అమరా వెంకటసుబ్బారావు మాట్లాడుతూ కొత్త జీఎస్టీ వలన రాష్ట్రానికి రూ.8వేల కోట్లు నష్టం వస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలలో కొనుగోలు శక్తి పెంచేందుకు జీఎస్టీ 2.0 ను అమలులోకి తీసుకు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ నెల్లూరు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వై. యానాది, కావలి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వై.వీ జ్యోతి, శ్రీశైలం దేవస్థానం కమిటీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, టీ. వీరా స్వామి, రాజేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్‌రావు

శుభ్రతతో ఆరోగ్యం !

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం. శారీరక పరిశుభ్రత... ప్రధానంగా చేతుల పరిశుభ్రత పాటించకపోవడం వల్లే ఎంతో మంది వ్యాధుల బారిన పడుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. పిల్లలు మట్టిలో ఆడుకుని ఆ తర్వాత చేతులు సరిగా శుభ్రం చేసుకోకుండా ఆహారం తీసుకోవడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. పెద్దలు కూడా వివిధ కారణాలు, అవగాహన లోపంతో శుభ్రతలేక రోగగ్రస్తులవుతున్నారు. ఇలాంటి వారికి ఒక్కోసారి హెపటైటిస్ వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చిన్నతనం నుంచే చేతుల పరిశుభ్రతపై సరైన అవగాహన కల్పించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆహారం తినే ముందు, మల విసర్జన తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవడం ఎంతో ముఖ్యమని హెచ్చరిస్తున్నారు.

● చేతుల పరిశుభ్రతలేక అనేక వ్యాధులు
● వీటి ప్రాధాన్యతపై నిర్లక్ష్యం వీడాలి
● 60 శాతం వ్యాధులు వీటి వల్లే
● ప్రాణాంతక వ్యాధులూ వచ్చే అవకాశం
● చిన్నారుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి

నేడు గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అపరిశుభ్రమైన చేతితో ఆహారం తినడం వల్ల ఆ చేతులలో ఉన్న బ్యాక్టీరియా, బ్యాక్టీరియా గుడ్లు కడుపులోకి వెళ్లి వ్యాధులు కలుగజేస్తాయి. జిల్లాలో ప్రస్తుతం నమోదవుతున్న రోగాలలో 60 శాతం చేతులు అపరిశుభ్రత వల్లే వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. టైఫాయిడ్, అతిసారా, కలరా, బంక విరేచనాలతోపాటు శ్వాసకోశ వ్యాధులు కూడా ప్రబలుతున్నాయని, ప్రత్యేకించి స్వైన్‌ఫ్లూ వంటి ప్రాణాంతక వ్యాధి ఇలాంటి నిర్లక్ష్యం వల్ల కూడా వ్యాపిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో చేతుల పరిశుభ్రతపై అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

ప్రచారం ఏది?

చేతుల పరిశుభ్రతపై ప్రభుత్వ పరంగా ప్రజలను చైతన్య వంతులను చేయాల్సిన అవసరం ఉంది. అయితే ఆదిశగా చర్యలు మాత్రం తీసుకోవటం లేదు. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, ఐసీడీఎస్‌లు సంయుక్తంగా చేతుల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ తగిన ప్రచారం కల్పించడంలో వైఫల్యం చెందుతున్నారన్న విమర్శలున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలోకూడా చిన్నారులు, గర్భవతులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించకపోవడంతో ఎంతో మంది రక్తహీనతకు గురవుతున్నారు. స్వచ్ఛభారత్ - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో పరిసరాలతోపాటు చేతుల పరిశుభ్రతపై కూడా ఉవ్వెత్తున చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

చేతుల పరిశుభ్రతలేకే అనేక వ్యాధులు

చేతుల పరిశుభ్రత లేకపోవటం వల్లే అనేక వ్యాధులు వస్తున్నాయి. చేతులారా అనారోగ్యాన్ని కోరి తెచ్చుకుంటున్నాము. దినచర్యలో భాగంగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులను సబ్బుతో కడగాలి. తద్వారా క్రిములు కడుపులోకి పోకుండా ఆపొచ్చు. ఆసుపత్రికి వచ్చే రోగులలో చాలా మంది చేతుల అపరిశుభ్రత వల్లే వ్యాధులకు గురవుతున్నట్లు తెలుస్తోంది. అంటురోగాలకు కూడా అపరిశుభ్రతే కారణమవుతోంది. చేతుల పరిశుభ్రతపై విస్తృత ప్రచారం అవసరం.



- డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి, ప్రభుత్వ వైద్యుడు

నేర నియంత్రణకు నాకాబందీ

● ఎస్పీ అజిత వెల్లడి ● అర్ధరాత్రి నగరంలో పరిశీలన



నెల్లూరులోని వారధి సెంటర్‌లో నాకాబందీని పరిశీలిస్తున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో భాగంగా నాకా బందీ నిర్వహిస్తున్నామని ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. రాత్రిపూట వాహనాల తనఖీలు తీవ్రతరం చేసి రౌడీయిజం, దౌర్జన్యాలు, దోపిడీ, దొంగతనాల నిర్మూలించడం, రోడ్డు ప్రమాదాల నివారణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో జరుగుతున్న నాకాబందీని సోమవారం అర్ధరాత్రి ఆమె పరిశీలించారు. ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం, నాలుగు కాళ్ళ మండపం, నెల్లూరు బ్యారేజ్, మెడికవర్ వైద్యశాల, బుజబుజ నెల్లూరు, అయ్యప్పగుడి సెంటర్, కరెంట్ ఆఫీస్, ఆర్టీసీ బస్టాండు, వీఆర్సీ తదితర ప్రాంతాల్లో పరిశీలన జరిపారు. అనంతరం నైట్ బీట్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి బీట్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి 1580 వాహనాలు తనిఖీ చేయగా ఓపెన్ డ్రింకింగ్ 52 కేసులు, డ్రంకన్ డ్రైవ్ 17 కేసులు నమోదు చేసి మూడు వాహనాలు సీజ్ చేశామని, ఎంవీ యాక్ట్ కేసులు 179 నమోదు చేసి రూ.58,795 అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు.

నిమ్మ సాగులో అనవసర ఖర్చులు తగ్గించుకోవాలి

● ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నిమ్మ సాగులో అనవసరపు ఖర్చులు తగ్గించుకోవాలని, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి నిమ్మ రైతులకు సూచించారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో మంగళవారం ఉద్యాన రైతులకు నిమ్మ పంటపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. పెరియవరం కేవీకే శాస్త్రవేత్త డీ తిరుపాల్ మాట్లాడుతూ నిమ్మలో పూతను నియంత్రించుకుని అధిక ధరలు ఉన్న సమయంలో పంటను తీసుకునేందుకు జూన్, సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో శాస్త్రవేత్తల సూచనల మేరకు జెబ్బరిల్లిక్ ఆమ్లం, సూకోసిల్, పొటాషియం నైట్రేట్‌ను నీటితో కలిపి పిచికారీ చేయాలని వివరించారు. వేరుకుళ్ళు నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిమ్మ పరిశోధప స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం కవిత తెలియజేశారు. కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే వెంకట సతీష్, నిమ్మతోటలో అంతర పంటల సాగుపై ఆత్మకూరు ఉద్యానశాఖ ఏడీ అనూరాధ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మార్కెటింగ్ ఏడీ అనిత, పలువురు అధికారులు, శాస్త్రవేత్తలు, ఉద్యాన రైతులు, ఉద్యాన విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడి



కమిషనర్ చాంబరులో చర్చిస్తున్న మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు

ఈ - వేలంలో ఐడీఎస్ఎంటీ ప్లాట్లు

● మున్సిపల్ ఉన్నతాధికారుల నిర్ణయం

కావలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో 30 ఏళ్ల కిందట పురపాలక సంఘం వేసిన లేఅవుట్‌లోని ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ స్మాల్ అండ్ మైనర్ టౌన్ (ఐడీఎస్ఎంటీ) ప్లాట్లలో మిగిలిపోయిన ప్లాట్లను ఈ వేలం ద్వారా విక్రయించాలని మున్సిపల్ ఉన్నతాధికారులుతో కూడిన ఐడీఎస్ఎంటీ కమిటీ తీర్మానించింది. కావలి మున్సిపల్ కమిషనర్ చాంబరులో మంగళవారం గుంటూరు రేంజ్ మున్సిపల్ పరిపాలనశాఖ రీజనల్ డైరెక్టర్ హరిక్రిష్ణ, టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ మధుకుమార్, ప్రజా ఆరోగ్యశాఖ నెల్లూరు సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌లు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఆదాయం పెంపొందించుకునేందుకు మిగిలి ఉన్న ఐడీఎస్ఎంటీ ప్లాట్లు ఎంత ధరకు ఎలా విక్రయించాలనే దానిపై చర్చించారు. ఐడీఎస్ఎంటీ ప్లాట్లలో ప్రస్తుతం 11 అంకణాల ప్లాట్లు 72, 37 అంకణాల ప్లాటు1, 35 అంకణాల ప్లాట్లు 6 ఎవరికి కేటాయించకుండా మున్సిపాల్టీ ఆధీనంలో ఉన్నాయి. వాటిని వేలం వేస్తే ప్లాట్ల ధరలు పెరుగుతాయని నిర్ణయించారు. స్థానికంగా వేలం వేస్తే కొన్ని సమస్యలు వస్తాయని ఈ వేలం ద్వారా విక్రయించి మున్సిపల్ ఆదాయం పెంపొందించుకోవాలని నిర్ణయించారు. ఆ నిధులతో ఐడీఎస్ఎంటీ ప్లాట్లలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

బైపాస్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని వెంకట్రావుపల్లి సమీపంలో హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి ఆత్మకూరు పట్టణంలోకి రూ. 6.31 కోట్లతో చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేస్తామని ప్రచాయతీ రాజ్ ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ విభాగం (పీఆర్‌పీఐయు) ఎస్ఈ కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన ఆత్మకూరులో జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బైపాస్ రోడ్డు 2.5 కి.మీ పొడవు, 9 మీటర్లు వెడల్పుతో నాలుగు వరుసల రహదారిగా 18 మీటర్లు వెడల్పుతో విస్తరిస్తామని తెలిపారు. సెంటర్ డివైడర్, లైటింగ్, వాకింగ్ ట్రాక్‌కు మార్జిన్ ఉండేలా నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌పీఐయు ఈఈ సత్యనారాయణరెడ్డి, డీఈ సుధాకరయ్య, ఏఈ మవేకొరెడ్డి పాల్గొన్నారు.



బైపాస్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

కడనూతలలో జాతీయ మానవహక్కుల కమిషన్ బృందం

బిట్రగుంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో మంగళవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ బృందం పర్యటించింది. ఇక్కడ గ్రామస్థులు, ఆర్ఎస్ఆర్ కళాశాల యాజమాన్యం మధ్య ఏర్పడిన మురుగునీటి పారుదల సమస్యపై జాతీయ మానవహక్కుల కమిషన్ బృందంలో అధికారులు కుల్బీర్‌సింగ్, యతిప్రకాశ్‌శర్మ, సంజయ్ కుమార్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారించారు. కళాశాల కరస్పాండెంట్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కళాశాల్లో వినియోగించిన వ్యర్థనీటి పారుదలకు అడ్డంకులు కల్పిస్తున్నారని ఫిర్యాదు చేయగా, విద్యార్థులు వినియోగించిన వ్యర్థనీరు, మలమూత్రాలను బయటకు విడుదల చేయడం వలన పంట కాలువలో కలిసి దుర్వాసన వెదజల్లడమే కాకుండా పొల్లాలోకి దిగాలంటే ఇబ్బందిగా మారిందని గ్రామస్థులు, రైతులు ఫిర్యాదు చేశారు. కళాశాల ప్రహరీకి తూర్పున ఉన్న కడనూ తల దళితవాడకు చెందిన శ్మశానవాటికలోకి కళాశాల మురికినీరు చేరడం వలన పెద్దల పండుగ రోజు పూజ చేసుకునేందుకు అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్రాంతంలో ప్రతాప్‌కుమార్ రెడ్డి స్వార్థంతో మట్టి తోలడం వలన సమాధులు భూగర్భంలో కలిసి పోయాయని వివరించారు. ఈ సమస్యపై రెవెన్యూ, ఇరిగేషన్, గ్రామపంచాయతీ మండల సర్వే అధికారులతో వారు మాట్లాడారు. కళాశాల నిర్వాహకుల సమస్యలు, గ్రామస్థుల విన్నపాలను జాతీయ మానవహక్కుల కమిషన్ బృందం వేర్వేరుగా అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులతో సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మీడియాను నిరాకరించడంతోపాటు పరిశీలన వివరాలను వెల్లడించేందుకు వారు నిరాకరించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దారు భరత్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, రూరల్ సీఐ పాపారావు, బోగోలు దగదర్తి ఎస్ఐలు ప్రభాకర్, జంపాని కుమార్, సర్వేయరు వెంకటేశ్వర్లు, వీఆర్వో శివ, కార్యదర్శి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మానవ హక్కుల కమిషన్ బృందానికి సమస్యను వివరిస్తున్న గ్రామస్థులు



పాడిరైతులకు మందుల సంచులు అందజేస్తున్న జేడీ రమేష్‌నాయక్, తదితరులు

పశువుల్లో

గర్భకోశవ్యాధుల నివారణకు చర్యలు

● పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్

కొండాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పశువులలో గర్భకోశ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్ అన్నారు. పశుగణాభివృద్ధిశాఖ, పశుపంవర్ధకశాఖలు సంయుక్తంగా మండలంలోని తూర్పుఎర్రబల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశవ్యాధుల చికిత్స శిబిరంలో ఆయన పాల్గొన్నారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. గర్భకోశ వ్యాధులు సోకకుండా వైద్యులు సూచించిన సలహాలు పాటించాలని జేడీ తెలిపారు. పాడి రైతులకు ప్రభుత్వం 75 శాతం రాయితీతో పశుగ్రాసాన్ని అందచేస్తుందన్నారు. రానున్న వర్షాకాలంలో పశువులకు, గొర్రెలకు వ్యాధులు సోకకుండా ముందస్తుగానే టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు జీ.శ్రీధర్‌రావు, ఈవోఎల్‌డీఏ శ్రీనివాసరావు, ఏడీ సురేష్‌బాబు, సర్పంచు ఏసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మేము లోకల్.. నీ అంతు తేలుస్తాం..!

● ఆర్టీసీ కండక్టర్‌పై అద్దె బస్సు డ్రైవర్, మెకానిక్ దాడి
● అధికారులకు ఫిర్యాదు చేశాడన్న కక్షతోనే..

కావలిరూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మేము లోకల్.. నీ అంతు తేలుస్తాం.. అంటూ ఆర్టీసీ బస్సు కండక్టర్ నార్నె వెంకయ్యపై ప్రైవేటు హయ్యర్ బస్సు డ్రైవర్ శ్రీకాంత్, గ్యారేజీలో మెకానిక్‌గా పనిచేస్తున్న రాఘవ అలియాస్ దాసు దాడి చేసిన సంఘటన మంగళవారం రాత్రి కావలి ఆర్టీసీ డిపోలో జరిగింది. బాధితుడు, స్థానికుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ఒంగోలు ప్రాంతానికి చెందిన వెంకయ్య కావలి ఆర్టీసీ డిపో నుంచి దామవరం వయా నెల్లూరు బస్సు కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం డ్యూటీ దిగిన వెంకయ్య నెల్లూరులోని ఆర్టీసీ అధికారులను కలిసేందుకు ఈడీ కార్యాలయానికి వెళ్లి సాయంత్రం తిరిగి కావలికి వచ్చాడు. రాత్రి బస్సు కోసం వేచి ఉండగా వెంకయ్య వద్దకు మద్యం మత్తులో వచ్చిన డ్రైవర్ శ్రీకాంత్, మెకానిక్ రాఘవలు విచక్షణా రహితంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ కాళ్లు చేతులతో ప్రైవేటు పార్టులపై దాడి చేశారు. మేము లోకల్.. నీ అంతు తేలుస్తాం.. అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. అక్కడ ఉన్న ఆర్టీసీ సిబ్బంది కండక్టర్ వెంకయ్యను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా 6 నెలల క్రితం ఇద్దరు ఒకే బస్‌లో ఒక్కరోజు డ్యూటీ చెయ్యగా స్టేజీల వద్ద ప్రయాణికులను దించేందుకు బస్ ఆపమని కండెక్టర్ చెప్పినా ఎక్కడో దూరంగా ఆపేవాడని డ్రైవర్ శ్రీకాంత్‌పై కండక్టర్ వెంకయ్య ఫిర్యాదు చేశాడు. దాన్ని దృష్టిలో పెట్టుకుని దాడి చేశాడని, అంతకు మించి అతనెవరో కూడా నాకు తెలియదని కండక్టర్ వాపోతూ 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కండక్టర్‌ను కింద పడేసి కాలితో దాడి చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్, మెకానిక్

నకిలీ మద్యం నిర్మూలించాలి

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని, బెల్టుషాపులను నిర్మూలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని మంగళవారం స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైసీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నేతలు మాట్లాడుతూ గ్రామ గ్రామాన మద్యం దుకాణాలు, విచ్చలవిడిగా బెల్టుషాపులుతో మద్యం ఏరులై పారుతుందన్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ ఆర్ వెంకటరమణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, బూత్ కమిటీల జిల్లా అధ్యక్షుడు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

మనుబోలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఓ స్కూల్ బస్సు డ్రైవర్ ఫూటుగా మద్యం సేవించి బస్సు నడపి పిల్లలను ఆందోళనకు గురిచేసిన సంఘటన మంగళవారం మండలంలోని కొలనుకుదురులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... స్థానిక దళితవాడ నుంచి సుమారు 36మంది పిల్లలు గూడూరులోని ఓ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు వెళతారు. బస్సు డ్రైవర్ మద్యం సేవించి గూడూరు నుంచి బస్సు నడిపాడు. చివరికి గ్రామంలోని శివాలయం పక్కన ఉన్న కాలువలోకి తీసుకెళ్లడంతో చిన్నారులు హడలిపోయారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. డ్రైవర్‌ను పాఠశాల నిర్వాహకులు మందలించారు. పిల్లలు సురక్షితంగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వైద్యుల సమ్మెకు సిబ్బంది సంఘీభావం

ఉదయగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు పరిష్కరించాలని వైద్యులు చేస్తున్న సమ్మెకు స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యఆరోగ్య సిబ్బంది సంఘీభావం తెలిపారు. వైద్యుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు చేపట్టాలన్నారు.

యూరియా పంపిణీపై అవగాహన

చేజర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి). ఇటీవల యూరియా పంపిణీలో రైతులు ఇబ్బందులు పడిన నేపథ్యంలో రాబోయే సీజన్‌లో అటువంటి తప్పులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ శివనాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతు సేవా సిబ్బందికి, ఎరువుల దుకాణదారుల డీలర్లకు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి హిమబిందు, వ్యవసాయశాఖ సిబ్బంది, ఎరువుల దుకాణదారుల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

మసీదు భూమికి ఎసరు

- నెల్లూరులో కలాన్ మసీదు భూమి స్వాహాకు కుట్ర
- ప్రస్తుతం మార్కెట్ విలువ రూ. కోట్లలోనే..
- ఫోర్జరీ ఎన్‌వోసీని బలపరచమని ఒత్తిళ్లు
- ఆ దేవుడు చెప్పినా వక్ఫ్‌బోర్డు స్థలం ఇవ్వం : చైర్మన్ అజీజ్


నెల్లూరు నగరంలోని వివాదాస్పద కలాన్ మసీదు స్థలంలోని భవనం

నెల్లూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో కేవీఆర్ పెట్రోల్ బంకు కూడలి అంటే ఎంత ముఖ్యమైందో జిల్లా వాసులకు తెలిసిందే. అంతేకాక అది నగరంలో చెప్పుకోదగిన వ్యాపార కూడలి. అక్కడ సెంటు స్థలం విలువ రూ.కోట్లలో ఉంటుంది. అలాంటి ప్రదేశంలో కలాన్ మసీదుకి చెందిన ఆరు ఎకరాల భూమి ఉంది. అందులో కొంత మేర రోడ్డుకు పోయింది. మిగిలిన భూమి వివిధ పద్ధ తుల్లో ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇందులో సుమారు 1.5 ఎకరాల భూమికి సంబంధించి ఫోర్జరీ నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ)తో భూమిని స్వాధీనం చేసుకున్నారనే అభియోగంపై ఓ వ్యక్తిపై వక్ఫ్ బోర్డు క్రిమినల్ కేసు పెట్టింది. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉంది. కేసు చివరి దశకు వచ్చింది. ఈ కేసు ప్రైవేటు వ్యక్తికి అనుకూలం అయ్యేలా సహకరించాలని వక్ఫ్‌బోర్డుపై ఒత్తిళ్లు మొదలయ్యాయి. పలువురు రాజకీయ నాయకులు వివిధ మార్గాల ద్వారా వక్ఫ్‌బోర్డుపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు ముస్లిం మైనారిటీ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. రూ. వందల కోట్ల విలువైన వక్ఫ్‌బోర్డు భూమిని కాపాడాలని వారు కోరుతున్నారు.

● వైసీపీ ప్రభుత్వం హయాంలో ఎన్‌వోసీ

కలాన్ మసీదుకు చెందిన ఈ భూమిని వక్ఫ్‌బోర్డు తనకు విక్రయించిందని, దాన్ని విక్రయించుకోవడానికి, తనఖా పెట్టుకోవడానికి వక్ఫ్‌బోర్డు అనుమతి ఇస్తూ ఎన్‌వోసీ ఇచ్చిందని ఒక వ్యక్తి డాక్యుమెంట్లతోసహా నగరంలోని ఓ బ్యాంకును ఆశ్రయించారు. ఆ ఎన్‌వోసీ నిజమైనదా... కాదా..? అనుకునే క్రమంలో ఆ బ్యాంక్ యాజమాన్యం సదరు ఎన్‌వోసీని రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు పంపి వివరణ కోరింది. ఈ పత్రాలను పరిశీలించిన వక్ఫ్‌బోర్డు కార్యాలయం ఇది సీఈవో సంతకం కాదని, ఈ ఎన్‌వోసీ వక్ఫ్‌బోర్డు ఇచ్చింది కాదని లిఖితపూర్వకంగా బ్యాంకుకు తెలియజేసింది. దీంతోపాటు సదరు వ్యక్తిపై ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు పెట్టింది. ఐపీసీ 468, 471 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈకేసు కోర్టు విచారణలో ఉంది. సరిగ్గా ఈ సమయంలో వక్ఫ్‌బోర్డుపై ఒత్తిళ్లు మొదలయ్యాయి. కేసును ఉపసంహరించుకోవాలని, లేదా తీర్పు సదరు వ్యక్తికి అనుకూలంగా వచ్చేలా సహకరించమని పలువురు నాయకులు వక్ఫ్‌బోర్డుపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు ముస్లిం మైనారిటీ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు వేదికగా ఈ విషయమై పెద్ద చర్చ నడుస్తోంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వక్ఫ్‌బోర్డు భూములను కాపాడాలని ముస్లిం సంఘాలు కోరుతున్నాయి.

దేవుడు చెప్పినా ఇవ్వం...

- వక్ఫ్‌బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు అజీజ్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 14,(ఆంధ్రజ్యోతి): సాక్షాత్తూ ఆ దేవుడే దిగివచ్చి చెప్పినా వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తులు ఎవరికీ ధారదత్తం చేయబోమని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ అన్నారు. మంగళవారం నెల్లూరులోని జెండావీధి వద్ద ఉన్న షాదీమంజిల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా దేవుడి ఆస్తులను కాపాడాలని సీఎం చంద్రబాబు నాయుడు తనకు చెప్పారన్నారు.


కోటమిట్ట షాదీమంజిల్‌లో అధికారులతో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

ఆ దిశగా గట్టి నిర్ణయం తీసుకుని వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తుల రక్షణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. చైర్మన్‌గా తన వంతు బాధ్యత పూర్తయ్యే వరకు ఆస్తులు కాజేయాలనుకున్న దొంగలు, రియల్టర్లకు నిద్ర ఉండదన్నారు. తన ప్రాణం ఉన్నంత వరకు ఒక్క అంగుళం భూమి కూడా ఎవరినీ తాకనివ్వనని అజీజ్ తేల్చి చెప్పారు. తమ ఆస్తుల జోలికి వస్తున్న ల్యాండ్ మాఫియాతో వైజాగ్ నుంచి అనంతపురం వరకు నిత్యం పోరాడుతూనే ఉంటానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ముస్లింలకు చెందిన వక్ఫ్ ఆస్తులను కాపాడమని హిందువులే ముందుకు వస్తున్నారే తప్ప... మసీదు కమిటీలు వారు రావడం లేదని తెలిపారు. రానున్న వందేళ్లకు ఉపయోగపడేలా జెండావీధిలోని షాదీమంజిల్‌ను డిజైన్ చేసి నిర్మించారని తెలిపారు. నగరంలోని కొత్తహాలు థియేటర్ ఉన్న జామియా మసీదు స్థలాలు అమ్మినా, కొన్నా చెల్లవన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కూటమిలో రేషన్ కుంపటి..!

- ప్రభుత్వంలో దుమారం రేపిన కోటంరెడ్డి.. పట్టాభి ప్రెస్‌మీట్లు
- వారి వ్యవహారశైలిపై అధిష్ఠానం సీరియస్
- ఆ ఇద్దరిని టాల్‌రైట్ చేయవద్దని మంత్రి నారాయణకు ఆదేశం

నెల్లూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం వ్యవహారంపై నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరెడ్డిల ప్రెస్‌మీట్లు ఏకంగా కూటమి ప్రభుత్వంలో దుమారం రేపాయి. తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య అంతరాలు తెచ్చేస్థాయికి చేరుకున్నాయి. దీంతో తెలుగుదేశం అధిష్ఠానం సీరియస్ అయ్యింది. ఈ వివాదానికి కారణమైన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పట్టాభిరెడ్డిల విషయంలో కఠినంగా ఉండాలని, పార్టీలో ఉంటూ కూటమి ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా మాట్లాడేవారిని ఉపేక్షించవద్దని మంత్రి పొంగూరు నారాయణను అధిష్ఠానం ఆదేశించింది. రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక నాయకుడు వందల టన్నుల బియ్యాన్ని చెన్నైకి తరలిస్తున్నాడని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విలేకరుల సమావేశంలో ఘాటుగా విమర్శించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేరును ఆయన ప్రస్తావించారు.



దీనిపై నాదెండ్ల మనోహర్ తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, నారా లోకేష్ బాబుకు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. పార్టీలో ఉంటూ కూటమికి చెందిన నాయకులపై విమర్శలు చేయడం న్యాయమేనా అని ప్రశ్నించారు. దీంతో రాష్ట్ర టీడీపీ సీరియస్ అయ్యింది. మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పత్రికా ముఖంగా క్షమాపణలు చెప్పమని కోటంరెడ్డిని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఆదేశించారు. అదే సమయంలో మంత్రి నారాయణకు కూడా రాష్ట్ర పార్టీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పార్టీలో ఉంటూ పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడిన ఈ ఇద్దరి విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ఉదాసీనంగా ఉండవద్దని ఆదేశించింది. రేషన్ బియ్యంపై కోటంరెడ్డి ప్రెస్ మీట్‌కు దానికి ప్రతిగా సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ పట్టాభి ప్రెస్‌మీట్‌కు ప్రధాన కారణం వీరిద్దరి మధ్య ఉన్న వ్యక్తిగత వైరమే కారణమని రాష్ట్ర పార్టీ భావిస్తోంది. వ్యక్తిగత కక్షలతో పార్టీని, కూటమి స్ఫూర్తిని దెబ్బతీస్తున్న వీరిద్దరి షయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని, మీరు చూస్తూ ఎందుకు ఊరికే ఉన్నారని, ఇలాంటి వారిని టాల్‌రైట్ చేయవద్దని రాష్ట్ర పార్టీ మంత్రి నారాయణను గట్టిగా ఆదేశించింది.

‘వసతి’లో ‘జ్ఞానభూమి’

- హాస్టల్ విద్యార్థుల వివరాల నమోదుకు వెబ్‌సైట్
- సమాచారం పంపితేనే ఫీజు రీయంబర్స్‌మెంట్, కాస్మెటిక్ చార్జీలు
- ప్రక్రియ పూర్తి చేసేపనిలో అధికారులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో సరుకులు, విద్యార్థుల హాజరు వివరాలు తప్పనిసరిని నమోదు చేయాలి. వారి వివరాలు పక్కాగా ఉంటేనే ఫీజు రీయంబర్సుమెంటు, కాస్మెటిక్, ఇతర చార్జీలు పొందేందుకు వీలవుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో వసతులకు పెద్దపీట వేసింది. తాజాగా బీసీ, ఎస్టీ, ఎస్సీ, కాపు, ఈబీసీ, మైనార్టీ వర్గాల వివరాలు నమోదుకు, పక్కాగా సరుకులు మంజూరు నమోదు కోసం జ్ఞానభూమి వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది.


● 134 సంక్షేమ వసతి గృహాలు

జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహాలు 63, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు 71 ఉన్నాయి. మొత్తం 134 సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో పదో తరగతి చదివే విద్యార్థులు 8,389 వేల మంది ఉన్నారు. ఇవికాక బాలికల కాలేజీ వసతి గృహాలు 16 ఉన్నాయి. వీటిలో 1,100 విద్యార్థినులు ఉంటున్నారు. వీరందరికీ నమోదు ప్రక్రియ జరుగుతోంది.

● వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్

జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌కు విద్యార్హత వివరాలతో పాటు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పని సరి. గత విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారితో పాటు ఇప్పటికే లబ్ధి పొందుతున్న వారు పాత దరఖాస్తులను పునరుద్ధంచుకోవచ్చు. 75 శాతం హాజరు విధిగా ఉండాలి. కొత్త వారితో పాటు పాతవి పునరుద్ధరణ రిజిస్ట్రేషన్లు అన్నీ కళాశాలల్లో చేస్తారు. విద్యార్థి బయోమెట్రిక్ తీసుకుంటారు. ఆరు దశల వడపోత పరిశీలన విధానం ఈ వెబ్‌సైట్‌లో ఉంది. నిబంధనలకు విరుద్ధంగాగా భూమి, ఆస్తి, విద్యుత్ వినియోగం ఉన్నా, ప్రభుత్వ ఉద్యోగం, పన్ను చెల్లింపుదారులు, నాలుగు చక్రాల వాహనం కలిగి ఉన్నా, వెబ్‌సైట్‌లో నమోదుకు అనర్హులుగా పేర్కొంటారు. విద్యార్థులంగా రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేసుకుని ప్రభుత్వం అందించే లబ్ధి పొందేలా అధికారులు చర్యలు చేపట్టారు.

సోమశిలకు 13.732 క్యూసెక్కుల ప్రవాహం



అనంతసాగరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 13.732 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 74.037 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా దిగువకు 2,600, గేట్ల ద్వారా 7,500 ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,600 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నామన్నారు.

కండలేరులో 59.880 టీఎంసీలు

రాపూరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండలేరు డ్యాం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 59.880 టీఎంసీలుగా ఉన్నదని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 3400 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 2050 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందని తెలిపారు.

కార్గోల్లో టపాసులు

ప్రతి పార్శిల్‌ను తనిఖీ చేయాలని ఆదేశించాం

దీపావళి సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లోనూ, కార్గోల ద్వారానూ ప్రయాణికులు తీసుకువచ్చే వస్తువులను, పార్శిళ్లను తనిఖీలు చేయమని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సుల్లోనూ, కార్గో సర్వీసుల్లో బాణసంచా రవాణా చేస్తే, అలాంటి వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం.



- షమీమ్, జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలతో ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం భయం..భయంగా సాగుతోంది. ఇటీవల ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో ఓఆర్ బాగా పెరిగింది. దీంతో పల్లెలతోపాటు పట్టణ, నగర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో మహిళా ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా దీపావళి సందర్భంగా పండక్కి 20 రోజుల ముందుగానే ఇతర ప్రాంతాల నుంచి టపాసులను జిల్లాకు తెప్పించుకుంటున్నారు. టపాసుల రవాణాకు కార్గోను అధికంగా వినియోగిస్తున్నారని సమాచారం. ఆర్టీసీ కార్గోకి వచ్చే బాక్సులు ఏమిటనేది తెలియక పోవడంతో సిబ్బంది సైతం వాటిని మామూలుగానే రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో కార్గోలో వచ్చే టపాసులు ప్రమాదవశాత్తె పేలితే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని ప్రయాణికులు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఇకపోతే పట్టణాల నుంచి పల్లెలకు వెళ్లేవారు కూడా బస్సుల్లోనే బాణసంచా రవాణా చేస్తున్నారు.


నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్‌లో పార్శిళ్లు



అంతర్జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీలో బాలికలు, మహిళలతో కలెక్టర్ హిమాన్షు శుక్లా, అధికారులు

ఆడబిడ్డలను కాపాడుకుందాం

వివరాలు 8లో..

‘ఉపాధి’లో బోగస్‌కు.. ఈకేవైసీతో చెక్

- మస్టర్ల మాయాజాలానికి ఫుల్‌స్టాప్
- వచ్చేనెల 7కి పూర్తయ్యేలా చర్యలు

మర్రిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మస్టర్ల మాయాజాలం, ఇతర అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ తప్పనిసరి చేసింది. నవంబరు 7లోగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించింది.

● గతంలో ఇలా...

పలు ప్రాంతాల్లో క్షేత్రసహాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కూలికి రాకపోయినా కొందరికి మస్టర్లు వేస్తున్నారు. ఎక్కువ పనిచేసే శ్రామికులకు కొలతలు తగ్గించి.... దాన్ని దొంగ మస్టర్ల వారికి సర్దుబాటు చేస్తున్నారు. దీంతో నిజమైన శ్రామికులకు పూర్తి వేతనం అందేదికాదు. పనులు చేయని వారికి వీరితో సమానంగా నగదు జమ అవుతోంది. స్థానికంగా లేకపోయినా, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న వారికి సైతం కూలి మొత్తం జమ అవుతున్న ఉదంతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పనులకు హాజరయ్యే వారికే వేతనం అందేలా కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది.


శ్రామికులకు ఈకేవైసీ నమోదు పూర్తయితే బోగస్ మస్టర్లకు పూర్తిగా అడ్డుకట్ట పడుతోందని భావిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేయని వారికి.. నవంబరు 7తరువాత పనులు చూపించలేమని అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయమై డ్వామా సిబ్బంది ద్వారా గ్రామాల్లో ఇప్పటికే అవగాహన కల్పించారు. ఇక నుంచి పని ప్రాంతంలోనే రోజుకు రెండుసార్లు ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తారు. దీని వల్ల ఒకరి బదులు మరొకరు ఫొటోలు దిగి పని చేసినట్లు చూపినా డబ్బులు తీసుకోవటం కుదరదు. ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు, ఏఎస్ పేట, అనంతసాగరం, సంగం, ఆత్మకూరు, చేజర్ల మండలాల్లో ఏపీడీ ప్రతాప్‌కుమార్ రెడ్డి పర్యవేక్షణ ఇప్పటికే 90శాతం ఈకేవైసీ పూర్తయింది.


శ్రామికులకు ఈకేవైసీ చేస్తున్న ఉపాధి సిబ్బంది

కిలోకి అర కిలోనే..!

- మార్కెట్లలో తూకాల మాయాజాలం
- వ్యాపారులు ఇచ్చిందే కొలత, చెప్పిందే ధర
- దగా పడుతున్న వినియోగదారులు
- చేష్టలుడిగిన తూ.కొ శాఖాధికారులు

● నెల్లూరు నగరంలోని లక్ష్మీపురానికి చెందిన వెంకటేశ్వర్లు, సుభద్ర (పేర్లు మార్పు) దంపతులు చేపలు కొనేందుకు మైపాడురోడ్డులోని చేపలమార్కెట్‌కు వెళ్లారు. కిలో చేపలు ఇవ్వాలని అడిగారు. డబ్బులిచ్చి తీసుకున్న చేపలను అనుమానం వచ్చి బయటున్న దుకాణంలో తూకం వేయించగా అరకిలోనే ఉన్నాయి. ఇదేమిటంటూ వారు ఆ వ్యాపారిని ప్రశ్నించారు. అదంతేనని ఆయన బదులివ్వడంతో చేపలు వెనక్కి ఇచ్చేసి డబ్బులు తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు వారు.



ఇది ఓ ఉదాహరణ మాత్రమే.. నెల్లూరు నగరంలోని ఏసీమార్కెట్, డైకస్‌రోడ్డులోని పెద్ద చేపలమార్కెట్, మైపాడు రోడ్డులోని మరో చేపల మార్కెట్... ఇలా ఏ మార్కెట్ తీసుకున్న ఇదే దుస్థితి. మార్కెట్లలో జరుగుతున్న తూనికలు, కొలతలు, ధరల మోసానికి వెంకటేశ్వర్లు, సుభద్ర దంపతులేకాదు... నిత్యం అనేకమంది మోసపోతున్నారు. కిలో కూరగాయలు తీసుకుంటే ముప్పావు కిలోకూడా రావడంలేదు. కిలో రొయ్యలు కొంటే అరకిలో వస్తే గొప్ప. ఇక మటన్ షాపుల్లో అయితే పాతిక కేజీ అయినా తేడా కచ్చితంగా ఉంటుం ది. ఇదిలాఉంటే స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, పప్పులవీధి, రేబాలవారివీధి ప్రాంతాల్లోని హోల్‌సేల్‌కు నిత్యావసరాల సరుకుల వ్యాపారులదీ ఇదేతీరు. వారిచ్చిన కొలతలు, ధరలకు మనం తీసుకోవాలే తప్ప.. ఇదేంటని అడిగే పరిస్థితి లేదు. బయట మార్కెట్లలో జరుగుతున్న మోసాలు కనపడుతున్నా.. అంతా తెలిసినా.. ఏం చేయలేక, మరో మార్గంలేక విధిలేని పరిస్థితుల్లో ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. ఏసీ కూరగాయల మార్కెట్లో అర, పావు కిలోలకు ఎప్పుడో పాతరేశారు. అక్కడ కిలోపైన కొంటేనే వ్యాపారులు కూరగాయలు ఇస్తున్నారంటూ ప్రజలు వాపోతున్నారు. దీన్ని ప్రశ్నించే ధైర్యం కూడా చేయలేమని వారంటున్నారు.

నెల్లూరు(సిటీ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్ర ధాన మార్కెట్లన్నీ మాఫియా చేతుల్లో ఉండటంతో వినియోగదారులకు సరైన కొలతలు,ధరలు అందడం లేదన్న వాదన ఉంది. రాజకీయ నేతలు కొందరు మార్కెట్లలోకి ప్రవేశించి, అక్కడ వ్యాపారులకు అండగా నిలుస్తున్నారు. కొన్నిచోట్ల వారే వ్యాపారులుగా చలామణి అవుతున్నారు. దీంతో మాఫియా గ్యాంగ్‌లతో మార్కెట్లు ఉన్నాయని నగరవాసులు అంటున్నా రు. మార్కెట్‌లో ఏమి కొనుగోలు చేసినా వాటిని తని ఖీ చేసుకునే వెసులుబాటు లేదు. ఎవరికైనా ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలూ ఉండటం లేదు. మార్కెట్లలో తూనికలు, కొలతల్లో భారీగా తేడాలు కనిపిస్తున్నా ఆ శాఖ అధికారులు ఎక్కడ దాడులు చేయకపోవడం పలు అనుమానాలు తావిస్తున్నదని, కనీసం అప్పుడప్పుడు ఆకస్మిక దాడులు చేసినా వ్యాపారుల్లో భయం ఏర్పడుతుందని ప్రజలు అంటున్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

మా శాఖ ఇన్స్‌పెక్టర్లు తరచూ దాడులు చేస్తూనే ఉన్నారు. ఎవరైనా వ్యాపారులు అవకతవకలకు పాల్పడినట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా మార్కెట్లకు వెళ్లినప్పుడు తప్పులు జరిగితే ప్రశ్నించాలి.

- ఐజాక్, తూ.కొ శాఖ డిప్యూటీ కంట్రోలర్

ఆకస్మిక దాడులేవి..?



మార్కెట్లలో వ్యాపారుల వద్ద ఉండే తూకాల యంత్రాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే బా గుంటుంది. మార్కెట్లలో అంతా మోసమే. విధిలేక కొనాల్సిన దుస్థితి. ఈ మధ్య ఆకస్మిక దాడులు కరువయ్యాయి.

- గాలి వెంకటేష్, వావిలేటిపాడు

ఎవరు పట్టించుకుంటారు...?



మార్కెట్లకు వెళ్లి కొనేది రూపాయి తగ్గుతుందని, కానీ అక్కడ కూడా మోసాలు చేస్తే ఇక పేదలను ఎవరు పట్టించుకుంటారు. ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకోవాలి. .

- ఈగ చెంచమ్మ, ధనలక్ష్మీపురం

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	222
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 525

గూగుల్ క్లౌడ్ సంస్థ రాష్ట్రానికి ఓ మైలు రాయి : ఎమ్మెల్యే

కావలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖకు గూగుల్ క్లౌడ్ సంస్థ రాక రాష్ట్రసర్వతో ముఖాభివృద్ధికి ఓ మైలు రాయిగా నిలుస్తోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్‌లు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఏడాదిగా మంత్రి లోకేష్ చేసిన కృషి ఫలితంగా రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు 2లక్షల ఉద్యోగాలను సృష్టించే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకు రావటం చారిత్రాత్మక విషయమన్నారు. దేశంలోనే తొలిసారి 15 బిలియన్ డాలర్ల ఎఫ్‌ఐ పెట్టు బడులను సాధించటం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమన్నారు. గూగుల్ క్లౌడ్ సంస్థ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థతోపాటు వ్యవసాయం, వైద్యం, విద్య రంగాలు బలోపేతం అవుతాయన్నారు.

హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన అవసరం

ఉలవపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలస్థాయి నుంచి ప్రతివిద్యార్థి హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని కరేడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు సూచించారు. మంగళవారం కరేడు జడ్పీ హైస్కూల్లో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నివారణ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఏఎన్ఎంలు శ్రీలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

తహసీల్దారును దుర్భాషలాడిన యువకుడు

లింగసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు మద్యం మత్తులో తహసీల్దారు కార్యాలయంలో విధినిర్వహణలో ఉన్న తహసీల్దారు కే.కోటేశ్వరరావును దుర్భాషలాడాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం జరగగా తహసీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ యువకుడిని పోలీసులు అదేరోజు రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఆ యువకుడి తల్లిదండ్రులు, బంధువులు, పలువురు నేతలు మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకొని తహసీల్దారు కోటేశ్వరరావుతో చర్చించి మద్యం మత్తులో తప్పు చేశాడని, అందుకు ఆ యువకుడితో క్షమాపణ చెప్పించడంతో రాజీ కుదిరింది.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఆర్టీవో టీవీఎన్ లక్ష్మి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ రవాణా అధికారి కార్యాలయంలో ఆటోడ్రైవర్లుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంవీఐ జంగాల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో కాలువల్లో పూడికతీత

కావలిరూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనెమడుగు పంచాయతీ మసీదు కాలనీలో ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాలతో మంగళవారం కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. ఈ కాలనీలో ఏళ్లతరబడి మురుగు నీటి కాలువలు పూడిక, చెత్తతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుండటంతో పాటు వర్షం పడినప్పుడు రామిశెట్టి గుంట నుంచి మన్నంగిదిన్నె చెరువుకు వెళ్లవలసిన వర్షపునీరు కాలనీలోని ఇళ్లలోకి చేరింది. దీంతో విషజ్వరాల భారిన పడుతున్నట్లు ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు నన్నేసాహెబ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి కాలువల్లో పూడికతీత, చెత్త తొలగింపు పనులు చేయించారు. నేతలు గుడిపల్లి వెంకట్రావ్, కోణంకి రమణయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురెడ్డి పర్యవేక్షించారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

బిట్రగుంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అక్షయ మహిళా యువజన సంఘం అధ్యక్షురాలు జీశైలజ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సెట్నల్ కార్యనిర్వాహణాధికారి ఏ.నాగేశ్వరరావు, నెహ్రూయువకేంద్ర యూత్ అధికారి ఏ.మహేంద్రరెడ్డి పాల్గొన్నారు. ఈనెల 23వ తేదీన నెల్లూరు డీకేడబ్ల్యూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జీ.గంగాధర్‌రావు, ఉపాధ్యాయులు శివపార్వతి, వెంకటేశ్వర్లు, బీ.శ్రీనివాసరావు, ఎండీ.గయాస్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కందుకూరు వైసీపీ కార్యాలయంలో ఇటీవల ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ సమక్షంలోనే మాజీ కౌన్సిలర్ రేణమాల అయ్యన్నపై కులం పేరుతో దూషించి దాడిచేసిన మల్లెబోయిన రామారావుపై కేసు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఆర్‌పీఎస్ నాయకులు మంగళవారం పట్టణ ఎస్‌ఐ శివనాగరాజుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఉసురుపాటి బ్రహ్మయ్య, అత్యాల శరత్, గౌడపేరు కృష్ణ, రేణమాల మాధవ్, గౌడపేరు మహేష్, రావినూతల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయ ప్రాంగణంలో చెట్లను కాపాడాలి

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న శతాబ్దాల నాటి వృక్షాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని పిన్నంరాజు ప్రభాకరరావు, తానికొండ వెంకటేశ్వర్లు, పీఆర్‌కే మురళి, తల్లపనేని నరసింగరావు, సురేష్, సతీష్‌కుమార్ సబ్ కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో 120 ఏళ్లకు పైబడిన వేపచెట్లు, చింతచెట్లు ఉన్నాయని, వాటిలో కొన్నింటిని ఆలయ పునర్నిర్మాణంలో బాగంగా తొలగించారని, వాణిజ్య సముదాయం అభివృద్ధి కోసం మిగిలిన చెట్లను కూడా తొలగించే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు. ఆ వృక్షాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు వారు తెలియజేశారు.

స్వదేశీ ఉత్పత్తులనే ఉపయోగించాలి

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విదేశీ వస్తువులకు ప్రత్యామ్నాయంగా స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించటం ద్వారా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వయం సంవృద్ధి - భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవకాశం ఉందని బీజేపీ జిల్లా నాయకుడు చుండి హరగోపాల రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మన్నేపల్లి వరప్రసాదరావు, గట్టమనేని హరిబాబు, జొన్నాదుల రాఘవయ్య, మువ్వల భూషయ్య, పాలూరి మాల కొండారెడ్డి, నవులూరి రాజేష్, తుమ్మపూడి శివమహేశ్వరరావు, జగన్నాథం వైకుంఠం పాల్గొన్నారు.

● బీజేపీ నేతల ప్రతిజ్ఞ

కావలి(టౌన్): ఆత్మ నిర్భర్ కార్యాశాల (స్వయం సమృద్ధి, భారత్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ ఒకటవ పట్టణ కార్యాలయంలో స్వదేశీ వస్తువులే వినియోగిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్, నేతలు గుండ్లపల్లి భరత్‌కుమార్, కంచర్ల మురళీకృష్ణనాయుడు, బెల్లకొండ మాల్యాద్రి, కుట్టుబోయిన బ్రహ్మానందం, పరుసు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల మహాధర్నాను జయప్రదం చేయండి

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 15వ తేదీన విజయవాడలో నిర్వహించ తలపెట్టిన మహా ధర్నాను జయప్రదం చేయాలని వీఆర్‌ఏల సంఘం డివిజన్ నాయకుడు, సీఐటీయూ అధ్యక్షుడు జీ.రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కందుకూరు డివిజన్‌లోని వీఆర్‌ఏలంతా భారీగా తరలిరావాలని ఆయన ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.